

పొగాకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

కలిగిరి (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పొగాకు బోర్డు ఒంగోలు రీజనల్ మేనేజర్ ఎస్ రామారావు సూచించారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పంటల మార్పిడిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2025-26 పంటకాలానికి ఎఫ్‌సీవీ పొగాకు సాగు విస్తీర్ణం కొంతమేర తగ్గించుకొని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలిగిరి, డీసీపల్లి పొగాకు బోర్డు సంయుక్త వేలం నిర్వహణాధికా రాజశేఖర్, వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్ కలిగిరి, డీసీపల్లి పొగాకు రైతులు, వ్యవసాయాధికారులు, పొగాకుబోర్డు సిబ్బంది పాల్గొన్నారు.





మనుబోలు : సంగమేశ్వరాలయంలో శివలింగం ఆకృతిలో దీపాలు



సీతారామపురం : భైరవకోనలో స్నానమాచరిస్తున్న భక్తులు



నెల్లూరు : నగరంలోని మూలస్థానేశ్వరుడి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మహా రుద్ర హోమం

శివోహం!

- వైభవంగా ఆఖరి కార్తీక సోమవారం

కార్తీక మాసంలో చివరి సోమవార పూజలు వేడుకగా జరిగాయి. వందే శివంశంకరం.. హరశంకర శివశంభో అంటూ భక్తుల నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగిపోయాయి. తెల్లవారుజాము కడలి, నదులు, బావుల్లో భక్తులు చన్నీటి స్నానాలు చేశారు. ఆలయాల్లో శివనామస్మరణలు చేస్తూ పాలభిషేకాల్లో పాల్గొన్నారు. మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, కేదారేశ్వరనోములు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలలో నందీశ్వరుడికి, మహాశివుడికి పాలభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఆలయాలన్నీ కార్తీక దీపాలతో శోభిల్లాయి. సాయంత్రం ప్రాకార ఉత్సవాలు, కార్తీక వనభోజన సమారాధనలు నిర్వహించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

25లోగా స్మార్ట్ రైస్ కార్డులు తీసుకోండి

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రైస్ కార్డులను ఈనెల 25వ తేదీలోగా తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బి. లీలారాణి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు 7,10,998 స్మార్ట్ కార్డులు రాగా, వాటిలో 6,35,716 కార్డులను లబ్ధిదారులు తీసుకున్నారని తెలిపారు. ఇంకా 75,282 కార్డులు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్డులు తీసుకోని వారు ఈనెల 25వ తేదీలోగా రేషన్ డీలర్ వద్ద, సచివాలయంలో సంప్రదించి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో 20,17,681 యూనిట్ల ఈకేవైసీ చేయాల్సి ఉండగా, 19,41,252 యూనిట్లకు మాత్రమే ఈకేవైసీ చేశారన్నారు. 76429 యూనిట్లకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. కార్డుదారులంతా ఈనెల 25 లోగా రేషన్ డీలరును సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

పొట్టకూటి కోసం వెళుతూ..

- బొలెరో వాహనం బోల్తా : ఇద్దరి మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- బాధితులంతా కూలీలే



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

వారంతా శ్రమ జీవులు. రెక్కాడితేగానీ డొక్కాడదు. ఉదయాన్నే అంతా కలిసి సెంట్రింగ్ సామగ్రితో బొలెరో వాహనంలో బయలుదేరారు. అల్లూరు మండలం సింగపేట వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కావలి మండలం బట్లదిన్నెకు చెందిన ఉప్పాల శీనయ్య (55), బండ్ల ప్రసాద్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. చేబ్రోలు హజరత్తయ్య, బండ్ల నాగరాజు, పెనుమల్లి వేణురెడ్డి, వల్లపల్లి తిరుపతిరావు, బండ్ల దిలీప్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు 108 సాయంతో క్షతగాత్రులను నెల్లూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.

- పూర్తి వివరాలు 8లో..



ప్రైవేటు గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం

ఎరువుల దుకాణాల్లో
విస్తృత తనిఖీలు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు పెట్టి విక్రయిస్తున్న రూ.6.6 లక్షల డీఏపీ, ఇతర ఎరువుల అమ్మకాలు నిలిపి వేస్తూ మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత ధరకు మించి ఎరువులను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలం లోని ఆర్‌ఎస్‌కేలలో 120 టన్నుల యూరియా ఉందని, వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తిచేశారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం : సోమశిల జలాశయానికి సోమవారం 6,596 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 150, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 73.600 టీఎంసీలు నిల్వ ఉంది.

ఇంకెన్నాళ్లు!

- నాలుగేళ్లయినా పూర్తికాని పెన్నా రక్షణ గోడల నిర్మాణం
- వరదలొస్తున్నాయంటే ఆ కాలనీల్లో భయం భయం
- మంత్రి దృష్టి పెడితేనే ప్రయోజనం
- అదనపు ప్రతిపాదనలపై సీతకన్ను పరిశీలన

ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్నట్లు మారాయి పెన్నా రక్షణ గోడల నిర్మాణ పనులు. రెండేళ్లలోపు పూర్తి కావాల్సిన నిర్మాణం, నాలుగేళ్లయినా ఇంకా సాగుతూనే ఉంది. గత ప్రభుత్వంలో సగం పనులు జరగ్గా, బిల్లులు రాక కొంతకాలం పనులు నిలిచాయి. ఎన్నికల తర్వాత కొంతమేర పనులు జరిగినా గడిచిన ఏడాది నుంచి నెమ్మదించాయి. బిల్లుల సమస్య లేకపోయినా పనుల్లో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. 2020, 2021 వరదల నాటి పరిస్థితులను తలచుకొని నెల్లూరు సిటీలోని వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీ, జనార్ధన్‌రెడ్డి కాలనీ ప్రజలు ఇప్పటికీ భయపడుతుంటారు. మొదట రూ.94 కోట్లతో నిర్మాణ పనులు మొదలుపెట్టగా, ఇప్పుడు పూర్తిస్థాయిలో కాంక్రీట్ వాల్ నిర్మించేందుకు మరో రూ.197 కోట్లు అవసరమవుతుందని అధికారులు నిర్ధారించారు. దీంతో పెన్నా రక్షణ గోడ నిర్మాణ పనులపై కొంత సందిగ్ధత నెలకొంది.



అర్ధంతరంగా ఆగిపోయిన పెన్నా రక్షణ గోడ నిర్మాణం

నెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెన్నా రక్షణ గోడల నిర్మాణం వర్కుకు మొదట తెలుగుగంగ ప్రాజెక్ట్ అధికారులు టెండర్లు పిలిచారు. ఆ తర్వాత రెగ్యులర్ ఇరిగేషన్‌కు మార్చారు. ఎర్త్ బండ్ నుంచి కాంక్రీట్ వాల్స్‌కు ఎస్టిమేషన్లు రివైజ్ చేశాక అప్పటికి మంజూరైన నిధులు రెండు కిలోమీటర్లకు బదులు 630 మీటర్లకు సరిపోయాయి. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలోపు పూర్తి చేయాల్సి ఉన్నా నాలుగేళ్లు గడిచినా 60 శాతం కూడా పూర్తి కాలేదు. అయితే పెన్నా రక్షణ గోడను 630 మీటర్ల దూరం మాత్రమే నిర్మించి వదిలేస్తే ప్రయోజనం ఉండదు. ముంపు బారి నుంచి కాపాడాలన్న లక్ష్యం నెరవేరదు. కొత్త రైల్వే బ్రిడ్జి నుంచి జాతీయ రహదారి బ్రిడ్జి వరకూ రెండు కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. దీంతో ఇప్పుడు నిర్మాణం జరుగుతున్న 630 మీటర్లు పోగా మిగిలిన 1.42 కిలోమీటర్లు కూడా ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలి. ఈ నేపథ్యంలో గతేడాది ఇరిగేషన్ అధికారులు ఈ మిగిలిన దూరానికి ఎస్టిమేషన్లు తయారు చేశారు. కాంక్రీట్ వాల్ నిర్మించాలంటే మరో రూ.197.31 కోట్లు అవసరమవుతుందని తేల్చారు. ఈ ప్రతిపాదనలను ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పంపారు. గత వారంలో ఇద్దరు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లు నెల్లూరుకు వచ్చి ఈ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళ్లారు. అయితే ఇంత భారీ మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పుడు మంజూరు చేసే పరిస్థితి ఉందా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

● మంత్రి దృష్టి పెడితేనే..!

వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీ, జనార్ధన్‌రెడ్డి కాలనీలోని వేలాది కుటుంబాల రక్షణకు పెన్నా ప్రొటెక్షన్ వాల్ చాలా ముఖ్యమైనది. గతంలో పెన్నాకు భారీ వరదలు సంభవించినప్పుడు ఇక్కడి ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. మరోసారి అటువంటి దుర్భర పరిస్థితులు పునరావృతం కాకూడదంటే త్వరగా ప్రొటెక్షన్ వాల్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇటీవల పెన్నాకు ఓ మోస్తరు వరద వచ్చినా కొంతమేర గోడ నిర్మాణం జరిగి ఉండడంతో నీరు ఇళ్ల వైపు వెళ్లలేదు. అయితే గడిచిన ఏడాదిగా ఈ పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఈ పనులపై మంత్రి పొంగూరు నారాయణ దృష్టి పెడితేనే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఇంటింటికి తిరుగుతూ కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తిస్తున్న వైద్యాధికారులు

కుష్ఠు వ్యాధి
నివారణే లక్ష్యం

నెల్లూరు (వైద్యం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణే తమ లక్ష్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత వెల్లడించారు. కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు ప్రక్రియ జిల్లావ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. నగరంలోని ఎన్టీఆర్ కాలనీ, జేవీఆర్ కాలనీ, వైఎస్సార్ నగర్, చంద్రమౌళినగర్‌లలో వైద్యబృందం పర్యటించి కుష్ఠువ్యాధి అనుమానితుల నుంచి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి గ్రస్థుల గుర్తింపే లక్ష్యంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని ఆదేశించారు. ఎర్రటి మచ్చలు ఉన్నవారిని గుర్తించి వారి నమూనాలు సేకరించాలన్నారు. కొత్తగా అనుమానిత కేసులను వైద్యాధికారులకు తెలియచేయాలని తద్వారా వారికి వైద్యచికిత్సలు అందిస్తారని వెల్లడించారు. అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3,789 బృందాలు ఇంటింటికి తిరిగి కుష్ఠు వ్యాధి గ్రస్థులను గుర్తిస్తారని, 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ కో ఆర్డినేటర్ సురేష్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.



అష్టదిగ్బంధం!

- ఆత్మకూరు ఫ్లైవోవర్, అండర్ బ్రిడ్జి మూత
- మరమ్మతుల పేరుతో అధికారుల నిర్ణయం
- ఎక్కడికక్కడ ఆగిపోయిన వాహనాలు
- తొలిరోజే నరకం చూసిన నగరవాసులు

నెల్లూరు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల పేరుతో నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ బ్రిడ్జి, బోసుబొమ్మ వైపు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జీలను సోమవారం నుంచి పూర్తిగా మూసివేశారు. సుమారు 45 రోజులపాటు వీటిని తెరవరు. దీంతో ఒక్కసారిగా వేలాది వాహనాల రాకపోకలతో ఆత్మకూరు బస్టాండు కూడలి అష్టదిగ్బంధంగా మారింది. గంటల తరబడి వాహనాలు రోడ్లపై ఆగిపోవడంతో ప్రజలు నరకం అనుభవించారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, దినసరి కూలీలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



● ఆత్మకూరు బస్టాండు వద్ద సోమవారం ఉదయం నుంచే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

వెంకటేశ్వరపురం, మినీ బైపాస్ నుంచి వచ్చే బస్సులు, ట్రాక్టర్లు, వ్యాన్‌లు, ఆటోలు, బైక్‌లు ఫ్లైఓవర్ మూసివేయడంతో కిందనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో బస్టాండు వద్ద ఉన్న కోవూరు, బుచ్చి వైపు వెళ్లే ఆటోలు, ప్రైవేటు బస్సులు సగం రోడ్డును ఆక్రమించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్టోన్‌హౌస్‌పేట బ్రిడ్జి దాటిన తర్వాత ఆటోస్టాండ్‌లతో ట్రాఫిక్ అంతరాయం, శెట్టిగుంట రోడ్డుకు అటు ఇటు దుకాణదారులు ఆక్రమించడంతో ట్రాఫిక్ మరింత జటిలమైంది. ఇక వంతెనకు వేస్తున్న పెయింట్ పనులతో సగం రోడ్డు స్టాండులతో నిండిపోయింది. ఇలా చెప్పుకుంటూపోతే ఆత్మకూరు బస్టాండు కూడలి ఒక్కరోజులో నగరవాసులకు నరకం చూపించింది.

● మరోవైపు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం కావడంతో రంగనాయకులపేట గేటు వైపు నుంచి నగరంలోకి ప్రజలు వెళుతున్నారు. దీంతో వేలాది వాహనాలు రైల్వే గేటు మార్గం వైపు తిరుగుతున్నాయి. అయితే గేటు వేస్తే వాహనాలు బారులు తీరుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు, రైల్వే అండర్ బ్రిడ్జిని ఒకేసారి మూయడంతో ప్రజల్లో అసహనం నెలకొంది. ఒక పని తర్వాత ఒక పని మొదలు పెట్టి ఉంటే ఇబ్బందులు ఉండేవి కావని అభిప్రాయపడుతున్నారు.

'గండికోట'ను సత్కరించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మాతృభాషపై మమకారం పెరిగేలా పుస్తకపఠనం ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న బుచ్చి ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణమోహన్, కార్యదర్శి కుమార్ రాజా సత్కరించారు. సోమవారం నెల్లూరు స్టోన్ హౌస్‌పేట జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 58వ గ్రంథాలయ వారోత్సవాలలో సత్కరించారు. బుచ్చి ఎంఈఓలు, దిలీప్‌కుమార్, రత్నం, సహోపాధ్యాయులు గండికోటను అభినందించారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11800
వెండి కిలో ధర	రూ. 160000
వెండి ఒక గ్రాము	రూ. 165.00

బుడ్డి డ్రైన్‌ను ఆదుకునేదెవరు?

- కట్టల ఆక్రమణ
- గుర్రపుడెక్కతో సమస్యలు

ముత్తుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మూడు మండలాలను ముంపునీటి ముప్పు నుంచి తప్పించే బుడ్డి డ్రైన్ తనను ఆదుకునేది ఎవరా.. అంటూ ఎదురుచూస్తోంది. వర్షాలు కురిసిన ప్రతిసారి పై నుంచి వచ్చే వరద నీటిని సముద్రానికి తీసుకువెళుతూ చుట్టుపక్కల ఉన్న పొలాలను మునిగిపోకుండా కాపాడే బుడ్డి డ్రైన్ చుట్టుపక్కల రైతుల ఆక్రమణతో కుచించుకుపోతుంది. సాధారణంగా కనిపించే ఈ డ్రైన్ ప్రయోజనాలను 30 ఏళ్ల కిందటే గుర్తించిన అప్పటి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డ్రైన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మైనర్ డ్రైన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు భూసేకరణకు పరిహారం ఇచ్చే అవకాశం లేకున్నా అప్పటి సీఎం చంద్రబాబుతో మాట్లాడి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. కోటి 30లక్షల వ్యయంతో బుడ్డి డ్రైన్ అభివృద్ధి పనులకు 1996 మార్చిలో సీఎం చంద్రబాబుచే



ఆక్రమణలతో కుంచించుకుపోయి, గుర్రపుడెక్కతో నిండిన బుడ్డి డ్రైన్

శంకుస్థాపన చేయించారు. మూడు మండలాల ముంపు నీరు పూర్తిగా వెళ్లేలా విశాలంగా డ్రైన్‌ను తవ్వించడంతోపాటు పరిసరాల్లో ఉన్న రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా ట్రాక్టర్లు వెళ్లేలా కట్టలు ఏర్పాటు చేయించారు. అనంతరం రెండుసార్లు టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్రైన్‌కు మరమ్మతులు చేయించారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ హయాంలో బుడ్డి డ్రైన్ నిరాదరణకు గురైంది. గుర్రపుడెక్కతో నిండిన డ్రైన్‌ను బాగు చేయించడం వదిలేసి, విశాలంగా ఉన్న కట్టల ఆక్రమణకు తెరతీశారు. ఎక్కడికక్కడ సమీప పొలాల యజమానులు అందినంతమేరా చట్టను ఆక్రమించుకుంటూ చివరకు డ్రైన్ కట్టలను పొలం గట్ల స్థాయికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వర్షాలు పడితే ముంపు నీరు వెళ్లే మార్గం లేక చుట్టపక్కల పొలాలు నీటమునిగే ప్రమాదం చోటుచేసుకుంది. బుడ్డి డ్రైన్‌కి వైభవం కల్పించిన ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరొకసారి ప్రత్యేక దృష్టి సారించి ఈ డ్రైన్‌కి పూర్వవైభవం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. బుడ్డి డ్రైన్ కట్టల ఆక్రమణలను తొలగించి యధాస్థాయిలో డ్రైన్ అభివృద్ధికి గుర్రపు డెక్కను తొలగించి ముంపు నీరు వెళ్లేందుకు మార్గం సుగమనం చేయాలని వేడుకుంటున్నారు.

శ్రీశ్రీ చిత్రపటం ఆవిష్కరణ



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్నసిబ్బంది

కోవూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం పౌర గ్రంథాలయాల సంచాలకులు మహాకవి శ్రీశ్రీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ పేరు చిరస్థాయిగా నిలచి పోయిందన్నారు. అభ్యుదయ కవితా ఉద్యమానికి ఆయన ఆద్యుడన్నారు. మహాప్రస్థాన గీతా అందరూ చదవాల్సిందిగా కోరారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి లైబ్రేరియన్ సురేంద్రరెడ్డికి పలు సూచనలు చేశారు. గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ పాఠకుడు ఆర్ సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే భారతి, ఉపాధ్యాయులు ఏ శ్రీనివాసులు, టీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లను ఆధునీకరించాలి

కోవూరు : మండల పరిధిలోని గ్రామీణ రోడ్ల ను ఆధునీకరించాలని సీపీఎం నాయకులు ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవా రం తహసీల్దారు కార్యాలయంలో వినతి ప త్రం సమర్పించారు. సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడుతూ అధ్వాన్నంగా తయారైన సాలు చింతల- కోవూరు, గుమ్మళ్ళదిబ్బ, పాటూరు- ఎల్లాయ పాళెం గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చే యాల్సిందిగా కోరారు. సీపీఎం నాయకులు గండవరపు బుజ్జయ్య, అఫ్రోజ్, హరి, బాబు, సురేష్, యస్దానీ, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న అంజయ్య

రాపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా నాలుగవ రోజు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి ఏ అంజయ్య ఆధ్వర్యంలో కవి, రచయిత గురజాడ వెంకట అప్పారావు గొప్పతనాన్ని వివరించారు. ఆయన కన్యాశుల్కం, ముత్యాల సరాలు వంటి రచనల ద్వారా ఎంతో కృషి చేశారని, విద్యార్థినీ, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్, గ్రంథాలయ సహాయకుడు కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఇందుకూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూనూరు గ్రామంలో గిరిజన కాలనీవాసులకు గ్రామీణ రూరల్ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు షేక్.బషీర్ ఆధ్వర్యంలో సోమవారం తుఫాన్ వలన నష్టపోయిన గిరిజన 100 కుటుంబాలకు 12 రకాల నిత్యావసర వస్తువులు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం నెల్లూరు పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నెబోయిన చెంచుకిషోర్ మాట్లాడుతూ గ్రామీణ రూరల్ అభివృద్ధి సంస్థ కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గిరిజన కాలనీలో ప్రత్యేక దృష్టి పెట్టి తుఫాను సందర్భంగా నిత్యావసర వస్తువులు, తార్‌పాలిన్ పట్టలు పంపిణీ చేస్తూ గిరిజనులకు అండగా నిలబడటం ఎంతో శుభసూచకమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసే సంస్థలు ఇంకా బలోపేతం కావాలని స్వచ్ఛంధ సేవకులు వారికి అండగా నిలబడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రావుల అరుణ, నేజూరు కోటేశ్వరి, పుల్లూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు నీటి సంఘాల అధ్యక్షులు బాలబొమ్మ వెంకటశేషయ్య, తిరకాల శ్రీనివాసులు, చిట్టిబోయిన శోభన్‌బాబు, ముంగర విజయ్‌కుమార్, బాలబొమ్మ పాండు, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందజేయాలి

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో పంటలు సాగుచేసే రైతులందరికీ అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ కోరారు. ఈమేరకు ఆయన సోమవారం ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు.

ఏడాదికి పది లక్షల మందికి అన్నప్రసాదం

- కార్తీక వన భోజనాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి



అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమంలో ఏడాదికి పదిలక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. కార్తీక వన భోజనాల సందర్భంగా సోమవారం గొలగమూడి వెంకయ్య స్వామిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఆశ్రమంలో వన భోజనాలు చేస్తున్న భక్తుల ను పలకరించి, అన్నప్రసాదం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీటీడీ జేఈవోగా పనిచేసిన బాల సుబ్రహ్మణ్యం, రూపాయి జీతం తీసుకోకుండా గొలగమూడి జేఈవోగా ఉండి సేవలు అందిస్తున్నా రన్నారు. ఆయన వచ్చిన తరువాత ఆశ్రమం, ఆలయం చాలా అభివృద్ధి చెందినదన్నారు. ఆశ్రమానికి కోట్లాది రూపాయల విరాళాలతో హాస్టల్, స్కూల్, సిమెంట్ రోడ్లు, సబ్‌స్టేషన్ నిర్మాణాలు ఇవన్నీ ఆశ్రమం నిధితో దగ్గరుండి జేఈవో చేయిం చారన్నారు. హాస్పిటల్‌లో ఉచితంగా వైద్యసేవలు, కృత్రిమ అవయవాలు తయారు చేసి అవసరమైన వారికి అందజేస్తున్న డాక్టర్ జగదీష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాతమ్మతల్లికి పూజలు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి పంచాయతీ పరిధిలోని నల్లబాలెం గ్రామంలోని అరుంధతీయవాడలో టీడీపీ సీనియర్ నాయకులు పార్లపల్లి రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఆలయంలో శ్రీమాతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాత మ్మతల్లికి ప్రత్యేక పూజలు జరిపి, అమ్మవారి కరుణ అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. వేద పండితులు అమ్మవారికి విశేష పూజలు జరిపి ఎమ్మెల్యే సోమిరెడ్డికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం గ్రామస్తులు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బాలిరెడ్డి హనుమా రెడ్డి, కండే మస్తానయ్య, ఆడపాల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇందుకూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించారు. కుష్టు సంబంధిత లక్షణాలు ప్రాథమిక దశలోనే గుర్తించాలని, ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి చర్మ సంబంధిత సమస్యలు పరిశీలించి అనుమానం వస్తే సంబంధిత కేసులను పీహెచ్‌సీకి పంపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పరిశ్రమల్లో ఇటుక రాయి బట్టీల్లో, చేపలు, రొయ్యలు చెరువులు దగ్గర వలస కూలీలు అత్యంత పేదరిక పరిస్థితుల్లో ఉన్నవారు ఉన్నందున లెప్రసీ సర్వే చేసి వీరిపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రతి ఇంటికి మార్కింగ్‌కే పరిమితం కాకుండా క్షుణ్ణంగా ప్రతి సభ్యుల శరీరంపై ఉన్న మచ్చలను గమనించాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీనివాస రావు, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్‌బాబు, వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరిన్ రహిత నియోజకవర్గమే లక్ష్యం:కాకర్ల



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని ఫ్లోరిన్ రహిత నియోజకవర్గంగా తయారు చేయడమే లక్ష్యం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం వింజమూరు మండల పరిధిలోని చాకలికొండ పంచాయతీ పోలునాయుడుపల్లి గ్రామంలో రూ.8లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మహిళలకు బిందెలతో నీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామమైనందున వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలు, నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ సంచాలకులు కృష్ణమోహన్

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాల యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏ కృష్ణమోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఏ కృష్ణమోహన్ సూచిం చారు. ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం వారు సందర్శించి పుస్తక, నాణాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటుకు కృషి చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కెవి శేషారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు ఏ సుబ్బరాయుడు, ఎస్‌వి రమణయ్య, కొల్లా వెంకటేశ్వర్లు, విశ్రాంత గ్రంథ పాలకుడు ఏ గోవిందరెడ్డి, స్టూడెంట్స్ మోటివేటర్ వి నారాయణరావు, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ.శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

కుల్లూరులో వనభోజనాలు

కలువాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుల్లూరు అభయ అంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు కార్తీక సోమవారం వనభోజనాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ (థీమ్-5) అనే అంశానికి సంబంధించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అందులో భాగంగా తొలిరోజు సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 24న ఎమ్మార్పీలు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు, 28న వీవోఏలకు సంబంధించిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు శిక్షణ ఉంటుందన్నారు. కావున తప్పక హాజరు కావాలని కోరారు.

జొన్నవాడ ఆలయంలో వైభవంగా మహారుద్ర హోమం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో స్వామి వారికి మహారుద్రహోమం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో మల్లికార్జునస్వామివారికి మహ న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షితాయికి నవావరణపూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారిని అలంకారభూషితులను చేసి రుద్రహోమం వద్ద ఆలయ ముఖమండపంలో కొలువుదీర్చారు. గణపతిపూజతో ప్రారంభించిన హోమంలో అగ్ని ప్రతిష్ఠ, గణపతిహోమం మహారుద్ర హోమం, అమ్మవారికి శ్రీసూక్త, దుర్గాసూక్త సహిత దేవీ ఖడ్గమాల హోమం వైభవంగా నిర్వహించారు. నక్షత్ర సహిత నవగ్రహ హోమంతో మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఉభయదాతలకు భక్తులకు హోమ రక్ష (తిలక ధారణ)తో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ప్రదోషకాలంలో ఏకాదశ ద్రవ్యాలతో అధికార నందీశ్వరుడికి విశేషంగా వృషభార్చన చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రుద్రయాగం ఉభయదాతలు తుమ్మగుంట రమణయ్యనాయుడు, విమలమ్మ, శ్రీకాంత్, కీర్తి దంపతులతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- జొన్నవాడ పెన్నానదిలో భక్తులు స్నానాలు చేసి పరమ శివుడికి ప్రతీకగా సైకత లింగం ఏర్పాటు చేశారు. పసుపు, కుంకుమలతో అర్చించి తుమ్మిపూలతో పూజలు చేశారు. కార్తీక దీపారాధనతో నివేదనలు సమర్పించారు.

పాలాభిషేక మహోత్సవానికి పోటెత్తిన భక్తులు

పొదలకూరు : చోళుల కాలం నాటి పురాతన శివాలయా నికి కార్తీక మాస చివరి సోమవారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పాలాభిషేకం



బుచ్చి : కొలువుదీరిన మల్లికార్జున సమేత కామాక్షితాయి



రాపూరు: పడిపూజ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ

మహోత్సవారిని భక్తులు పోటెత్తారు. అయ్యప్ప సేవా యువ సమాజం సభ్యులు ప్రతి ఏటా కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఈ పాలాభిషేక మహోత్సవాన్ని భక్తులు పోటెత్తారు. అయ్య ప్ప సేవా యువ సమాజం సభ్యులు ప్రతి ఏటా కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఈ పాలాభిషేక మహోత్సవాన్ని మహాదేవునికి భక్తులే స్వయంగా వారి హస్తాలతో నిర్వహించుకునే ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శివాలయంలో ప్రత్యేక పూల అలంకరణతో ఏర్పాటు ప్రముఖ చిత్రకారుడు, గురుస్వామి ఏర్పాటు చేసిన నారికేళ శివలింగం, భక్తులను ఆకట్టుకుంది. భక్తుల శివ నామస్మరణలతో శివాలయం మార్మోగింది. భక్తిశ్రద్ధలతో పాలాభిషేకాన్ని నిర్వహించిన కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పోటెత్తారు.

కిక్కిరిసిన శైవాలయాలు

మనుబోలు: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని శైవాలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. హర హర మహాదేవ శంభో శంకరా అన్న భక్తుల నామ స్మరణతో శివాలయాలు మారుమోగాయి. శ్రీ కామాక్షితాయి సంగమేశ్వరా లయంలో శివలింగం ఆకృతి ఏర్పాటుచేసి దానికి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. మనుబోలు శివాలయంలో శివపార్వతుల పల్లకీసేవ నిర్వహించారు. బద్దెవోలు, మడమనూరు, కట్టువపల్లి, పిడూరు, కొలను కుదురు శివాలయాలన్నీ కార్తీకదీపాలతో శోభను సంతరిం చుకున్నాయి. అర్చకులు రుద్రాభిషేకాలు, పాలాభిషేకాలు, అన్నాభిషేకాలు నిర్వహించారు.

అయ్యప్పకు అంబలం పూజ

రాపూరు : స్థానిక మహావిష్ణువు, అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అంబల పూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో విద్యుద్దీపాలతో, మకర మండపాన్ని అలంకరించారు. గురుస్వాముల భజనలతో ఆలయం పులకించిపోయింది. అన్నదానం, పడి పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

మితిమీరిన వేగం.. పోయింది ప్రాణం!

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సుహెల్ మృతదేహం

మనుబోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేతిలో హెవీ సీసీ బైక్...అందులో హైవే. పైగా మెకానిక్. ఇంకేముంది... మితిమీరిన వేగంతో దూసుకెళ్లాడు. నెల్లూరు నుం చి మనుబోలు వరకు క్షేమంగానే వెళ్లిన ఆ యువకుడు వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో వేగాన్ని అదుపు చేయలేకపోయాడు. మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఎస్‌కే సుహెల్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నెల్లూరు ప్రగతి నగర్‌లోని పొదల కూరు రోడ్డు సెంటర్‌కు చెందిన రహంతుల్లా, షమ్మాలకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రహంతుల్లా ఎంబ్రా యిడింగ్ పనిచేస్తుంటాడు. కుమారుడు సుహెల్ ఏడాదిన్నరగా ట్రయాంప్ అనే మోటార్‌సైకిల్ కంపెనీలో మెకానిక్ (హెల్పర్)గా పని చేస్తున్నాడు. సోమవారం సుహెల్ విధులకు హాజరు కాకుండా, పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై గూడూరుకు బయలుదేరాడు. వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఎగిరి అవతలి రోడ్డుపై పడ్డాడు. సరిగ్గా అదే సమయంలో అవతలి రోడ్డుపై వెళుతున్న కంటైనర్ వెనుక భాగాన సుహెల్ పడడంతో తల పగిలి దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. సుహెల్ హెల్మెట్ ధరించి ఉండి ఉంటే ప్రాణాలు దక్కేవని స్థానికులు చెబుతున్నారు.

అన్న హత్య కేసులో తమ్ముడికి జీవితఖైదు

నెల్లూరు(లీగల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం సొంత అన్నను తల మీద కొట్టి కిరాతకంగా హత్య చేసి ఇంటిని తగలబెట్టిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు పాముల శీనయ్యకు జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 3వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎల్ తేజోవతి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముత్తుకూరు మండలం రొయ్యలపాళెంకు చెందిన పాముల శీనయ్య, పాముల సుబ్రహ్మణ్యం అన్నదమ్ములు. వీరికి ఆస్తి విషయంలో వివాదం ఉంది. ఈక్రమంలో 2022 మే 7వ తేదీన ఉదయం రొయ్యలపాళెంలోనే ఇనుపరాడ్‌కు గుడ్డ చుట్టి అన్న సుబ్రహ్మణ్యంను తమ్ముడు శీనయ్య వెనుక నుంచి తలపై బలంగా కొట్టాడు. ఆ తరువాత ఇంటికి కూడా నిప్పు పెట్టాడు. గాయపడిన సుబ్రహ్మణ్యంను చికిత్స నిమిత్తం బంధువులు తొలుత నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నారాయణ అసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ముత్తుకూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో నిందితుడికి పై విధంగా జైలు శిక్షతోపాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం చెంచుకృష్ణ వాదించారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భర్త కన్పించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మన్సూర్‌నగర్‌లో షేక్ మోబీనా, బషీర్ అహ్మద్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. బషీర్ అహ్మద్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మోబీనా నగరంలో అత్త, మామ, మరదలతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో తొమ్మిది నెలలుగా భర్త ఇంటికి రావడం లేదు. బషీర్ అహ్మద్ తల్లిదండ్రులు ఫోన్ చేస్తున్నా ఆయన తీయడం లేదని, వారు బెంగళూరుకు వెళ్లి అతను పనిచేస్తున్న చోట విచారించగా అక్కడ అతను కనిపించలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదని భార్య చిన్నబజారు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

నెల్లూరు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితులు పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదులపై చిన్నబజారు పోలీసులు సోమావారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మూలాపేట బెస్తపాలెం ప్రాంతంలో గొల్ల కిషోర్‌బాబు, రాచమల్లి శ్రీనివాసులు నివాసం ఉంటున్నారు. వారిద్దరు గత ఎన్నికల్లో కలిసి పనిచేశారు. అయితే కొంతకాలంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలో ఈనెల 16వ తేది సాయంత్రం లిటిల్ ఏంజెల్స్ పాఠశాల వద్ద ఒకరిపై ఒకరు దాడి చేశారంటూ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతుండిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. సంగం ప్రాంతానికి చెందిన నారాయణ(35) కొంత కాలంగా సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులో, మరే ఇతర కారణాలతోనో ఆదివారం ఆయన సుందరయ్యకాలనీ సమీపంలోని దుకాణాల వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న వేదాయపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- పెంచలకోనలో..

రాపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో టిటిడి కల్యాణ మండపం సమీపంలో సోమవారం ఓ గుర్తు తెలియని యాచకుడు (58) మృతి చెందాడు. ఆధారాలు లభించక పోవడంతో రాపూరు పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

నెల్లూరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తనకు చెందిన స్థలంలో అక్రమంగా ప్రవేశించడంతో పాటు తనపై దాడి చేశారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని ములుముడికి చెందిన బండి సంపూర్ణమ్మకు చెందిన స్థలంలో సమీప బంధువులైన బండి మల్లికార్జున్, ఆయన భార్య లక్ష్మిలు అక్రమంగా ప్రవేశించి ఇల్లు నిర్మించేందుకు 13వ తేదీన యత్నించారు. ఈ క్రమంలో ఆమె వారివురుని అడ్డుకోగా వారు తనపై కాళ్లు, చేతులతో దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కలువాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చీటీ డబ్బులు ఇవ్వ లేదని నిర్వాహకుడు ఇంటికి వచ్చి తనతో పాటు కుటుంబ సభ్యులను కూడా దూషించాడని కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి జంగాల కాలనీకి చెందిన తిరుపతి విక్రమ్ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన కలువాయిలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... విక్రమ్ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద చీటీ వేసి పనులు లేక డబ్బులు చెల్లించకపోవడంతో నిర్వాహకులు ఇంటికి వచ్చి తిట్టారు. దీంతో మనస్థాపం చెందిన విక్రమ్ సోమవారం ఉదయం కలువాయికి వచ్చి కలువాయమ్మ ఆలయం వద్ద పురుగుల మందు తాగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు అతడిని వైద్యశాలకు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 635

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కి 49 వినతులు

నెల్లూరు(సిటీ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వివిధ సమస్యలపై పరిష్కారం కోరుతూ 49 వినతులు అందాయి. ఇందులో పాల్గొన్న డీసీ చెన్నుడు, ఈఈ శేషగిరిరావులు పౌరుల నుంచి వినతులను స్వీకరించారు. సిటీప్లానింగ్, పారిశుధ్యం, హౌసింగ్‌తో పాటు ఇతర సమస్యలపై నగర వాసుల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాలకు పంపి వీలైనంత వరకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.



అర్జీని పరిశీలిస్తున్న డీసీ చెన్నుడు

ఔట్‌పోస్టులు ఏర్పాటయ్యేనా..?



ధనలక్ష్మీపురం వద్ద నిరుపయోగంగా ఉన్న పోలీసు ఔట్‌పోస్టు

- కొత్తూరు, వేదగిరి వద్ద ప్రతిపాదనలకే సరి..
- కొన్నేళ్లుగా ప్రజల నిరీక్షణ
- ధనలక్ష్మీపురం వద్ద ఉన్నా నిరుపయోగమే
- నేరాల నియంత్రణకు సిబ్బంది కొరత

నెల్లూరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగర శివార్లలో నేరాల కట్టడి కష్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థ పూర్తిగా కొరవడింది. ఇందుకు కారణం పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరతే. ఔట్ పోస్టులు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ ప్రజలకు సేవలు అందించాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఏళ్ల తరబడి ప్రజల ఎదురుచూపులు తప్ప ఆచరణలో అమలు జరగడం లేదు. ధనలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన పోలీసు ఔట్ పోస్టు తొమ్మిదేళ్లగా ఉపయోగంలో లేకపోవడంతో చివరకు శిథిలావస్థకు చేరింది.

● కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డుకాలనీలో తాజాగా ఓ వృద్ధురాలిని చితకబాదిన దుండగులు, ఆమె ఒంటిపై ఉన్న సుమారు 12 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఈ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది.

● నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై వారంలో మూడు రోజులు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నిలువరించేందుకు పోలీసులు సాహసం చేస్తున్నారు.

● వేదగిరి క్షేత్రం వద్ద నిత్యం ప్రేమజంటలు దర్శనమిస్తుంటాయి. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు పడరానిపాట్లు పడుతున్నారు.

● అంబాపురం కూడలి దాటాక ఆమంచర్ల వరకు ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది.

● ఇలా నెల్లూరు నగరానికి శివారున ఉన్న ప్రాంతాలు క్రైం జోన్లుగా మారుతోన్నాయి. ఈ ప్రాంతాల్లో నేరాలను అదుపు చేయాల్సిన పోలీసు స్టేషన్లకు సరిపడా సిబ్బంది లేరు. ఉన్న అతికొద్ది మందిని రోజు వారి కార్యకలాపాలకు వాడుతున్నారు.

● ఆచరణలోకి రాని ప్రతిపాదనలు

వేదగిరి క్షేత్రం వద్ద పోలీసు ఔట్‌పోస్టు పెట్టాలని గతంలో అనేకసార్లు ప్రతిపాదించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం, ప్రేమ జంటలు తరచూ సంచరిస్తుండటం, ఆకతాయిల తాకిడి, నేరాలు జరుగుతుండటంతో పోలీసులు ఈ మేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. కానీ ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు.

● తొమ్మిదేళ్లుగా శిథిలావస్థలో...

గతంలో ధనలక్ష్మీపురం వద్ద పోలీసు ఔట్‌పోస్టును అప్పటి ఐజీ, ఎస్పీలు ప్రారంభించారు. 2015 వరకు సేవలు అందించారు. ఆపై క్రమేణా ఔట్‌పోస్టు సేవలు తగ్గించుకుంటు వచ్చారు. గత తొమ్మిదేళ్లగా ఇక్కడ ఔట్‌పోస్టు భవనం శిథిలావస్థకు చేరుకుంది.

శివార్లలో నిఘా కట్టుదిట్టం

శివారు ప్రాంతాల్లో పోలీసు నిఘా కట్టుదిట్టంగానే ఉంది. ఔట్‌పోస్టులు వస్తే ఇంకొచ్చేం ఉపయోగకరం. రౌడీషీటర్లతోపాటు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై దృష్టి పెట్టాం. వాహనాలను తనిఖీ చేస్తున్నాం. బహిరంగ మద్యపానాన్ని నియంత్రించాం.

- జీ వేణు, రూరల్ సీఐ

ఔట్‌పోస్టును వినియోగంలోకి తేవాలి

ధనలక్ష్మీపురంలోని ఔట్‌పోస్టును పోలీసు అధికారులు వినియోగంలోకి తేవాలి. ఈ సేవలు అందుబాటులోకి వస్తే శాంతిభద్రతలు క్షేత్రస్థాయికి అందుతాయి. ఎస్పీ అజిత మేడం ఔట్‌పోస్టును పునరుద్ధరించాలి.

- కే. విజయభాస్కర్, ధనలక్ష్మీపురం

సుందరయ్య కాలనీ వద్ద అండర్‌పాస్ నిర్మించాలి : సీపీఎం



ఎన్‌హెచ్ఏ జీఎం వాల్సన్ జాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందయ్య కాలనీ వద్ద జాతీయ రహదారికి అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరులోని ఎన్‌హెచ్ఏ కార్యాలయంలో జీఎం వాల్సన్‌జాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ రహదారి ఏర్పాటై 22 ఏళ్లు పూర్తయిందన్నారు. ఇక్కడ బాక్స్ టైప్ బ్రిడ్జి లేక పోవడం వల్ల ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడ్డారన్నారు. భారత్ జవాన్లు కూడా మృతి చెందారని తెలిపారు. ఈ ప్రాంతాలలోని 23, 24 డివిజన్‌లలో పడారుపల్లి, ఆర్‌డీటీ కాలనీ, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు, ఇందిరమ్మకాలనీలలో 5 వేల కుటుంబాలు నివశిస్తున్నాయని చెప్పారు. జాతీయ రహదారి దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో సుందరయ్య కాలనీ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పెంచలనర్సయ్య, సురేష్, వీర్ల శ్రీనివాసులు, చైతన్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇరుముడుల ఊరేగింపు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివ మాల దీక్ష చేపట్టి పూర్తయిన సందర్భంగా మంగళవారం ఉదయం 7 గంటలకు తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శివ దీక్ష మాలాధారణ భక్తులకు ఇరుముడులు కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు తల్పగిరి రంగనాథస్వామి ఆలయం నుంచి ఇరుముడులతో ఊరేగింపుగా బయలుదేరి మూలస్థానేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని తెలిపారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఘన సన్మానం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును సన్మానిస్తున్న బొల్లినేని హజరత్‌నాయుడు, తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బీఆర్ నాయు డు) సోమవారం నెల్లూరులో ఉన్న గ్రీన్ హోమ్ రియల్ ఎస్టేట్ కార్యాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బొల్లినేని హజరత్‌నాయుడు, డైరెక్టర్ బొల్లినేని హరిబాబునాయుడు, బొల్లినేని ఆనందనాయుడులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని వెంకటరామారావు, బొల్లినేని వెంకట రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓం నమఃశివాయ.. శంభో శంకర!



మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో దీపారాధనలు చేస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే బారులుతీరారు. ఓం నమః శివాయ, శంభో శంకర అంటూ పాలాభిషేకాలు, మూలస్థానేశ్వరుడికి, సహస్ర లింగేశ్వరుడికి, వనంలోని శివయ్యకు భక్తులు భారీ ఎత్తున పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. అలాగే కేదారేశ్వర నోములు కనుల పండువగా జరిగాయి. సాయంత్రం ప్రత్యేక పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. భువనేశ్వరిదేవికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. రాత్రి కార్తీక దీపారధనకు భక్తులు పోటెత్తారు. తమ విశ్వాసాలతో తగ్గట్టు లక్ష వత్తులు, 365 వత్తులతో కార్తీక దీపారాధనలు చేశారు. ప్రమిదలతో విశేష అలంకారాలుగా కార్తీక దీపాలు వెలిగించారు. రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవాలు జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. అలాగే నీలకంఠేశ్వరస్వామి ఆలయం, వీరభద్రస్వామి ఆలయం, స్వర్ణాల చెరువు స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాధస్వామి ఆలయం పెన్నాతీరంలోని శివాలయంలో పూజలు, కార్తీక వనభోజన సమారాధనలు జరిగాయి.

● వైభవంగా శివకేశవుల పూజలు

నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో శివకేశవులకు విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శివయ్యస్వామి ఆధ్వర్యంలో 1008 మృతికా (పుట్ట మట్టి శివలింగాలు)తో భక్తులతో సహస్ర నామార్చనలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. విష్ణుమూర్తికి తులసీదళాలతో సహస్ర నామార్చనలు జరిగాయి. వేలాది మంది భక్తులు మహాశివలింగానికి బిల్వ పత్రాలతో, పాలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారు ఎంపీ ఆంజనేయులు పర్యవేక్షించారు.

ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తా

● అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ



పూజలు చేసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని సండేమార్కెట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అండర్ బ్రిడ్జి వద్ద రూ.1.02 కోట్లతో రోడ్డు ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ఈ పనులు ఒకవైపు 44 రోజుల్లోపు పూర్తవుతాయని స్పష్టం చేశారు. అనంతరం మరో వైపు రోడ్డు పనులు మరో రూ.కోటితో డిసెంబరు 31న ప్రారంభించి ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. వర్షాలు వస్తే సండేమార్కెట్లో నీరు నిలిచి సమస్యలు వస్తున్నందున అక్కడ కూడా శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నేతలు తాళ్లపాక అనురాధ, మధు, సుజనాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

● 15 హైస్కూళ్లను అభివృద్ధి చేస్తాం

నెల్లూరు(విద్య) : నెల్లూరులో వీఆర్ హైస్కూల్ తరహాలోనే మరో 15 మున్సిపల్ హైస్కూళ్లను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని కర్నాలమిట్ట మున్సిపల్ హైస్కూల్, బీవీఎస్ హైస్కూల్, చిన్నబాలయ్య హైస్కూల్, వైవీఎం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మరో 15 హైస్కూళ్లను ఆధునికీకరించి వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో నారాయణ కాంపిటీషన్ మెటీరియల్స్ అందించి మంచి మార్కులు సాధించేలా శిక్షణ ఇస్తామన్నారు. పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● మూడు నెలల్లో అండర్ పాస్ పనుల ప్రారంభం

చింతారెడ్డిపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని మంత్రి నారాయణ తెలిపారు. మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పనులు ప్రారంభమైన ఏడాదిలోపే అండర్‌పాస్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

● 38 మందిపై కేసుల నమోదు

● రూ.5,43,000 అపరాధ రుసుం విధింపు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏక కాలంలో విద్యుత్‌శాఖ 32 బృందాలతో సోమవారం విస్తృత దాడులు నిర్వహించి 38 మందిపై కేసులు నమోదు చేసింది. ఒంగోలు విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డీపీఈ హైమావతి, కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరయ్యలు తమ సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్న 38 మందిపై వివిధ కేసులు నమోదు చేసి రూ.5,43,000 అపరాధ రుసుము విధించినట్లు పేర్కొన్నారు. మీటరు ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మందిపై రూ.40,000, అనుమతి కన్నా అధిక కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న వ్యక్తిపై రూ.5000, అనుమతికి మించి అదనంగా విద్యుత్ వాడుతున్న 26 మందికి రూ.4,98,000 అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ విద్యుత్ వాడకానికి సంబంధించి ఫిర్యాదు చేయదలచినవారు 9440812358, 9440812359 నెంబర్లకు వాట్సప్ ద్వారా సమాచారం తెలియచేయాలన్నారు. విజిలెన్స్ దాడులు నిర్వహించిన వారిలో సింగరాయకొండ డీఈఈ యుగంధర్, ఉలవపాడు ఏఈ పీ సాయిబాబు, లైన్‌మెన్‌లు సత్యన్నారాయణ, మీరావలి, కందుకూరు, సింగరాయకొండ సబ్ డివిజన్‌కు చెందిన ఏడీఈ, ఏఈలు, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

నడిరోడ్లపైనే విద్యుత్ స్తంభాలు



జగదీష్‌నగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంటోంది. విద్యుత్ స్తంభాలరు ప్రజలకు ఇబ్బందులు లేకుండా, రోడ్డు చివర ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో నడిరోడ్లపైనే స్తంభాలు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి రోడ్లపైనున్న ఈ స్తంభాలపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ఆ రోడ్లపై ప్రయాణించే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నగరంలోని జగదీష్ నగర్, ఎన్‌టీఆర్ నగర్, సుజాతమ్మ లేఅవుట్ ప్రాంతాల్లో రోడ్లపైనే విద్యుత్ స్తంభాలు ఉంటున్నాయి. గతంలో ఇలాగే స్తంభాలు ఉండగా, అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్ల విస్తరణను చేపట్టింది. నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకం పనులను పూర్తి చేసిన నేపథ్యంలో 2019లోనే రోడ్లన్నింటినీ అభివృద్ధి చేశారు. అయితే అప్పట్లో విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించకుండానే అధికారులు సిమెంట్ రోడ్లు వేయించారు. ఆ తరువాత కూడా విద్యుత్ శాఖ అధికారులు వాటి గురించి పట్టించుకోలేదు. దాదాపు ఆరేడేళ్లగా నడిరోడ్లపైనే స్తంభాలు ఉంటూ, ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు రోడ్లపైనున్న స్తంభాలను పక్కకు తరలించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభం

లక్ష్యసాధనకు క్రీడలు దోహదం : వీఎస్‌యూ వీసీ

● కావలి జేబీలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

కావలి(టౌన్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనకు క్రీడలు దోహదపడతాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డాక్టర్ డీఆర్ క్రీడా ప్రాంగణంలో సోమవారం వీఎస్‌యు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జేబీ కరస్పాండెంట్ వేణుంబాక సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఉప కులపతి అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కే.సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకట్రాయలు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, నిబంధనలతో సంబంధం లేకుండా ప్రభుత్వం వారిని ఉన్నత పదవుల్లో నియమించి, సత్కరిస్తుందన్నారు. రిజిస్ట్రార్ కె సునీత మాట్లాడుతూ క్రీడాకారులకు వీఎస్‌యూ మంచి అవకాశాలు కల్పిస్తోందని, ప్రతి ఏటా క్రీడాకారుల సంఖ్య పెరగాలని కోరారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పురుషుల వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, టీటీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, దాదాపు 18 కళాశాలలనుంచి 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను యూనివర్శిటీ జట్లకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మహా చండీహోమం

● పూజలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



రాజరాజేశ్వరి ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు స్వాగతం పలుకుతున్న జిల్లా సహాయ కమిషనర్ జనార్దనరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మహా చండీహోమం వైభవంగా జరిగింది. మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళా భక్తులు తరలి వచ్చి కార్తీక, రాహుకాల దీపారాధనలు చేశారు. ఈ వేడుకల్లో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమారులు రవీంద్రనాథ్, సురేంద్రనాథ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారికి సహాయ కమిషనర్ కోవూరు జనార్దనరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు రఘురాంమూర్తి శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాజరాజేశ్వరి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం బీఆర్ నాయుడు కుటుంబం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం వేదపఠనం, కార్తీక దీపారాధనలు, సుందరేశ్వరస్వామికి కుంభహారతులు కనుల పండువగా జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ఘనంగా శ్రీవేలి ఉత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వేదాయపాలెంలో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామికి కేరళ సంప్రదాయ మండల పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత అయ్యప్పస్వామి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్చ పూజ, సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాళపూజ, కర్పూర దీపం, హరిహరాసనం, అయ్యప్పస్వామి సేవలు జరిగాయి. మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, కమిటీ సభ్యులు కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్‌చంద్ర పర్యవేక్షించారు.

ఘనంగా సంగీత కచేరి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పాఠశాలలో సంగీత కచేరి చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సోమవారం రాత్రి నగరంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత నృత్య కళాకారుల సంగీత, నృత్య కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలను విద్యార్థులు, అధ్యాపకులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ మునికుమార్ పర్యవేక్షణలో జరిగాయి.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి బార్ అసోసియేషన్ మెంబర్ ఏ.రాజశేఖర్‌రెడ్డిపై పుత్తూరు కోర్టులో ప్రతివాది హత్యాయత్నానికి ప్రయత్నించడానికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలియజేయాలని నిర్ణయించినట్టు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులిమి అయ్యప్పరెడ్డి, నక్కల నాగరాజు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నిరసనకు న్యాయాధికారులు, న్యాయవాదులు సహకించాలని కోరారు.

మూర్ఛవ్యాధికి ఆధునిక శస్త్రచికిత్స



మూర్ఛవ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్న వారితో కలిసి అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూర్ఛవ్యాధికి ఆధునిక శస్త్ర చికిత్స అందిస్తున్నట్లు నారాయణ ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, న్యూరాలజీ ఫిజీషియన్ హెడ్ డాక్టర్ సంపత్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో మూర్ఛవ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్న వారితో పాటు కొందరు వైద్యులు, వైద్య విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూర్ఛవ్యాధి మందులతో తగ్గకుంటే శస్త్ర చికిత్స ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా నారాయణలో మూర్ఛ వ్యాధికి శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. వ్యాధికి సంబంధించి మెదడుకు చికిత్స చేయాలంటే ఎలాంటి ఉపద్రవం జరుగుతుందోనన్న అపోహలు లేకుండా శస్త్రచికిత్స చేయించుకోవచ్చన్నారు. పూర్తిగా ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఈ శస్త్ర చికిత్స చేయించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ సాయికిరణ్, మత్తువైద్య నిపుణులు డాక్టర్ ప్రభావతి, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ మణి మేకల, రామారావు, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కు చెదరని నిర్మాణాలు... చరిత్రకు ఆనవాళ్లు!

స్వాతంత్ర్యానికి ముందు కోవూరు నియోజకవర్గ పరిధిలో నిర్మించిన వంతెనలు, తూములు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. బ్రిటీషు కాలంలో కనిగిరి రిజర్వాయర్ నుంచి వచ్చే పంటకాలువ (సదరన్ చానల్ డిస్ట్రిబ్యూటరీ చానల్) పై నిర్మించిన వారధి ఇప్పటికీ అలానే ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న వంతెనలు ఐదేళ్లకే మరమ్మతుల కు గురవుతున్నాయి. కోవూరు - నెల్లూరు మార్గంలో స్టోబీడీ కాలనీ సమీపంలో నిర్మించిన ఈ వంతెన నేటికీ సేవలందిస్తోంది. అయితే ఇటీవల వంతెన తూములకు వేసిన తెల్లసున్నం ఊడిపోయింది. ఈ క్రమంలో నీటిపారుదల శాఖాధికారులు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా ఇదేమార్గంలో పీటర్స్ కాలువపై నిర్మించిన వంతెన, భూమట్టంతో కలిసి పోవడంతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవతో పునర్నిర్మిస్తున్నారు.

-కోవూరు, (ఆంధ్రజ్యోతి)



గ్రంథాలయ వారోత్సవాల్లో

నాణేలు, నోట్ల ప్రదర్శన

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం కవి సమ్మేళనం, నోట్లు, నాణేల ప్రదర్శన నిర్వహించారు. కవి సమ్మేళనంలో చిన్నినారాయణరావు, ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధర్‌బాబు, సతీష్‌కుమార్ తదితర కవులు విచ్చేసి వారి కవితలు వినిపించారు. ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కరెన్సీ నోట్లు, నాణేల ప్రదర్శన నిర్వహించారు. పాఠకులను ఇవి ఎంతో ఆకట్టుకున్నాయి. రాష్ట్ర పౌరగ్రంథాలయ సంచాలకులు కృష్ణమోహన్ కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులను కప్పి సత్కరించారు. పుస్తకాన్ని బహుమతిగా అందచేశారు. నోట్లు, నాణెల ప్రదర్శనను తిలకించి సతీష్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులు, గ్రంథాలయాల సిబ్బంది, విద్యార్థులు, తదితరలు పాల్గొన్నారు.

-నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



అందరి సహకారంతో లాభాల బాట

- సహకార వారోత్సవ సభలో చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి



మాట్లాడుతున్న చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు, పాలక మండలి సహకారంతో తమ బ్యాంకు 109 ఏళ్ల పూర్తి చేసుకుని 110వ సంవత్సరంలోకి అడుగు పెట్టి లాభాల బాటలో సాగుతోందని నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి చెప్పారు. సోమవారం అర్బన్ బ్యాంకులో జరిగిన సహకార వారోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు లాభాల బాటలో పయనించడం వలన షేర్ హోల్డర్‌లకు 12 శాతం డివిడెండ్ అందచేశామన్నారు. జాతీయ బ్యాంకులతో సమానంగా సేవలందిస్తూ, డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2024-25లో రూ.80 లక్షల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. 2017లో చైర్మన్‌గా తాను బాధ్యతలు స్వీకరించక ముందు తమ బ్యాంకు ఎన్‌పీఏ 20 శాతానికి పైబడి ఉండేదన్నారు. దీనిని 4 శాతానికి తగ్గించి ఆర్బీఐ మెప్పు పొందామని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. నెల్లూరు డివిజన్ కోఆపరేటివ్ అధికారి కందుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహకార రంగంలో బ్యాంకులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లాభాల బాటలో నడవటమే కాక, డివిడెండ్ చెల్లించే స్థాయికి ఎదగటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పురిటిబిడ్డకు

చన్నీటి స్నానమా..!?

- జీజీహెచ్ ప్రసూతి విభాగంలో మూలనపడ్డ సోలార్ హీటర్లు
- మూడేళ్లుగా ఇదే పరిస్థితి
- వేడినీళ్లు బయట కొనుగోలు చేస్తున్న బాలింతలు
- త్వరలో అందుబాటులోకి... : సూపరింటెండెంట్ వెల్లడి

నెల్లూరు (వైద్యం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణులు, బాలింతలు గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇందువల్ల బ్యాక్టీరియా నశించి ఆరోగ్యాన్ని సమకూరుతుంది. అలాగే పుట్టినబిడ్డను తప్పనిసరిగా గోరువెచ్చని నీటితో తుడవాలి. తద్వారా తల్లికడుపులో ఉన్న మలినాలు, ఇతర వ్యర్థాలు బిడ్డకు అంటుకోవు. ఇందుకు వేడినీరు అవసరం. అయితే నగరంలోని జీజీహెచ్ ప్రసూతి విభాగంలో ప్రస్తుతం వేడినీరు అందుబాటులో లేదు. ఈ స్థితిలో గర్భిణలు, బాలింతలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం.

● పనిచేయని హీటర్లు

మూడేళ్లుగా ఇక్కడ ఉన్న 12 సోలార్ హీటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వేడినీటికి నానా కష్టాలు పడుతున్నారు. ఆసుపత్రిలో వేడినీరు అందుబాటులో లేక పోవటంతో బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలపై ఆర్థిక భారం పడుతుంది. సోలార్ హీటర్లు మరమ్మతులు చేయాలని జీజీహెచ్ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పురిటిబిడ్డకి వేడినీరు అవసరమని పదేపదే వైద్యులు చెబుతున్నా, వారి గోడు పట్టించుకునేవారు లేరు. రూ. 10వేల నుంచి రూ. 20 వేలు ఖర్చు చేస్తే సోలార్ హీటర్లు అందుబాటులోకి వస్తాయని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. వాటిని పరిశీలించి ఇన్ని రోజులు ఎందుకు మరమ్మతు చేయలేదని వైద్యసిబ్బందిని పలువురు ప్రశ్నించారు. సోలారు హీటర్లను అందుబాటులోకి తెచ్చేలా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కృషి చేయాల్సి ఉంది.



జీజీహెచ్‌లోని బాలింతలు, చిన్నపిల్లల వార్డు

త్వరలో అందుబాటులోకి తెస్తాం..

జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో వేడినీరు సరఫరా చేసే సోలార్ హీటర్లు మరమ్మతులకు గురైన విషయం నాకు తెలియదు. లేదంటే ఎప్పుడో అందుబాటులోకి తీసుకువచ్చేవాళ్లం. వెంటనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటా.

- డాక్టర్ మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్





మరమ్మతులకు నోచని సోలార్ హీటర్లు

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

- రియల్టర్లకు కట్టబెడుతున్న రెవెన్యూ అధికారులు ?
- సర్కార్ ఆదాయానికి భారీగా గండి

తోటపల్లిగూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కబ్జా కోరల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు, స్వయంగా వారే రియల్టర్లకు ప్రభుత్వ భూమిని కట్టపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే... తోటపల్లిగూడూరు మండలం ఈదూరు బిట్ వన్ మల్లికార్జునపురం గ్రామంలో సర్వే నెంబరు 42-1లో 3. 65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరా రూ.కోటి వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ఆ భూమికి అనుకుని రియల్టర్లు భూమిని కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు. ఆ భూమిని అనుకుని ఉన్న 3.65 ఎకరాల భూమిని తమ రియల్ ఎస్టేట్ భూముల్లో కలుపుకునేందుకు రెవెన్యూ అధికారులతో చేతులు కలిపి ఆక్రమించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రభుత్వ భూమి అత్యంత విలువైనది. అందువల్లే ఆక్రమణలకు గురైందని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల సర్వే చేసిన సర్వేయర్, తహసీల్దారు రికార్డును పరిశీలించి ప్రభుత్వ భూమి అని నిర్థారించారు. తొలుత ప్రభుత్వ భూమిగా నిర్థారించి ఎప్పుడైతే ఆక్రమణదారుడు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారో... ఆ భూమికి గతంలో పట్టా మంజూరైనట్లు చెబుతున్నారు. ఈ విషయంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులకు భారీ ముడుపులు అందినట్లుగా అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి రూ.కోటి విలువ చేసే భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు వీ.సుధీర్‌ను వివరణ కోరగా ఆ భూమి ప్రభుత్వ భూమి అని, ఆక్రమణలు ఉంటే తొలగిస్తామన్నారు. సమగ్రంగా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.



ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి

26 వరకు ఆధార్ శిబిరాలు

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో పిల్లలకు 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చెంచమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అర్జీలను పారదర్శకంగా విచారించాలి : కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను పారదర్శకంగా విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. పరిష్కరించలేని ఫిర్యాదులను ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో, అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

● అందిన అర్జీలు 453

పీజీఆర్ఎస్‌కు 453 వినతులను అర్జీదారులు సమర్పించారు. వీటిలో రెవెన్యూశాఖకి 155 అర్జీలు, సర్వేశాఖవి 29 , పోలీసు శాఖవి 101, మిగిలిన అర్జీలు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నావి. వాటిలో కొన్ని..

● ఖరీఫ్ కొనుగోళ్ల లక్ష్యాన్ని ముందుగా నిర్దేశించాలి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను ముందుగానే నిర్ణయించేలా ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ. సరేంద్రరెడ్డి కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయం చేయటం కోసం ముందస్తుగానే నివేదిక పంపాలని కోరారు.

● శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

నెల్లూరు (వైద్యం) : నగర పరిధిలోని బుజబుజనెల్లూరులో శ్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని డ్వామా పీడీ గంగాభవానికి సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు మాలకొండయ్య, క్రిష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, శివాజీ, అంజనేయులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా : ఇద్దరి మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- సింగపేట వద్ద ఘటన
- బాధితులంతా భవన నిర్మాణ కార్మికులే..

అల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం బోల్తా పడగా, ఇద్దరు మృతిచెందారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లూరు మండలం సింగపేట సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కావలి మండలం బట్లదిన్నెకు చెందిన ఉప్పాల శీనయ్య (55), బండ్ల ప్రసాద్ (55)తోపాటు చేబ్రోలు హజరత్తయ్య, బండ్ల నాగరాజు, పెనుమల్లి వేణురెడ్డి, వల్లపల్లి తిరుపతిరావు, బండ్ల దిలీప్ కలసి అల్లూరు మండలం గోగులపల్లికి బొలెరో వాహనంలో సెంట్రింగ్ సామగ్రి వేసుకొని బయలుదేరారు. వాహనాన్ని బండ్ల దిలీప్ నడుపుతుండగా, అందరూ నిల్చోని ఉన్నారు. ఉదయం 7.00 గంటల సమయంలో వాహనం సింగపేట దాటాక ఇంజన్‌కు, టైర్లకు జాయింటుగా అమర్చబడి ఉండే యాక్సిల్ రాడ్డు ముందు భాగం ఊడి నేలకు గట్టిగా ఆనింది. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో శీనయ్య, ప్రసాద్ కిందపడి, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది క్షతగాత్రులను నెల్లూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బండ్ల ప్రసాద్ (ఫైల్)



ఉప్పాల శీనయ్య (ఫైల్)

● బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అల్లూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కి 130 ఫిర్యాదులు



బాధితుల వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 130 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలపై ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, గిరిధర్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్లు భక్తవత్సలరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై క్షేత్రస్థాయి సర్వే



సర్వేలో వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి బృందం

నెల్లూరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులతో జబ్బున పడ్డ నెల్లూరు రూరల్లోని కొమ్మరపూడి, కొత్తవెల్లంటి గ్రామాల్లో వైద్య బృందం క్షేత్రస్థాయిలో క్షలో సర్వే చేపట్టారు. ఈ రెండు గ్రామాల్లో కి డ్నీ వ్యాధులు సోకి మరణాలు సంభవిస్తున్నాయని ఈనెల 10 న ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీ సుకువచ్చిన పరిశోధనాత్మక కథనంతో జిల్లా యంత్రాంగం కదిలింది. ఇప్పటికే గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఈ రెండు గ్రామాల్లో నీటి నమూనాలను సేకరించి పరిశోధనకు పంపారు. కాగా వ్యాధుల వ్యాప్తిపై సౌత్‌మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రవీంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం సోమవారం గ్రామాల్లో సర్వే నిర్వహించారు. వ్యాధిగ్రస్థుల ఇళ్లకు వెళ్లి రికార్డులు పరిశీలించి బాధితులతో మాట్లాడారు. వ్యాధి మూలాలను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామని, గ్రా మాల్లో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యం బృందం పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు : వీపీఆర్



విలేకరులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షతతో సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. సోమవారం నగరంలోని తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా రాష్ట్రానికి రూ.13,25,716 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకోవటం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో నిరంతరం జరిపిన సంప్రదింపులతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రభుత్వం తొలుత 8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తే అంతకు మించి రావటం గొప్ప విషయమని చెప్పారు. వీటి ద్వారా 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. జిల్లాస్థాయిలో 6,815 కోట్ల పెట్టుబడుల ద్వారా 4800 మందికి ఉద్యోగాలు రానున్నాయని వివరంచారు. జిల్లాలో జేఎం బాక్సీ గ్రూపు సంస్థ, ఇండోసోల్ కంపెనీ, ఐటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ, ఆర్‌సీఆర్‌టీలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వీహెచ్‌ఏకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపాన 167-బీజీ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. వింజమూరు మండలం కాటేపల్లికి చెందిన ఓంకారం వెంకటభరత్ సీతారామపురం మండలం అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో హాజరయ్యేందుకు స్వగ్రామం నుంచి మోటార్‌బైక్‌పై బయలుదేరిన వెంకటభరత్ దాసరిపల్లి గ్రామ సమీపానికి రాగానే ప్రమాదవశాత్తు రోడ్డుపై ఉన్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతన్ని నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశారు.

రైతులందరికీ యూరియా అందజేయాలి

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో పంటలు సాగుచేసే రైతులందరికీ అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ కోరారు. ఈమేరకు ఆయన సోమవారం ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న 3 బస్తాల యూరియాను ఒకేసారి అందజేయాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11800
వెండి కిలో ధర	రూ. 160000
వెండి ఒక గ్రాము	రూ. 165.00

న్యూస్ బాక్స్

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల పల్లకి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ గావించారు.

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఏవీఎస్ నాయకులు, విద్యార్థినులు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని విద్యార్థినులు ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి మాట్లాడుతు వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడు మహంత్‌రెడ్డి, నాయకులు చందు, వినయ్, తరుణ్, భరత్‌రెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడికి సన్మానం

సంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు వైద్య శాంతరం సోమవారం నెల్లూరుకు వచ్చిన సందర్భంగా జెండాదిబ్బ టీడీపీ నాయకులు సూరాయపాళెం పవన్‌కుమార్ నాయీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. నాయీ బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ఉదయగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీ అడవిపేరంటాలమ్మ ఆలయ ఆవరణలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా నెల్లూరు మెడికవర్, ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలల సహకారంతో పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత సాధారణ, కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పులుగుళ్ళ రవీంద్ర, దారపనేని చెన్నయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులు, మేడేపల్లి రత్తయ్య, గడ్డం ప్రసాద్, గడ్డం రత్నయ్య, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నూకనపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

కలువాయి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం కలువాయి శివసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు నూకనపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో రోడ్లపై ఉన్న గుంటలు పూడ్చటం, మొక్కలు నాటడం, తాగునీటి ట్యాంక్ శుభ్రం చేయడం లాంటి పనులు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీ.నరేంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ పీవో జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

సంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు కోటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులతో పాటు గ్రామస్థులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ సంప్రోక్షణ

ఉదయగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా స్వామివారికి గణపతి పూజ, కలశస్థాపన, విశేష హోమాలు తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం ఉంటాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


సంగం: సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఆత్మకూరు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వరుడు


ఉదయగిరి: అడవిపేరంటాలమ్మ ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాలకు చేరుకుని విశ్వేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, కాశీనాయన ఆశ్రమం, వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, కన్యకా పరమేశ్వరి, అలఘునాథస్వామి ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు చెరువులో భక్తులు కార్తీక దీపాలు వదిలి పూజలు చేశారు.

● **సంగం:** సంగమేశ్వరాలయానికి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. రాత్రి కార్తీక దీపాలు వెలిగించారు. అదేవిధంగా తిరుమనకొండ మీద ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో పీఠాధిపతి రాజ రాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో లలితారుద్ర మహాయజ్ఞం నిర్వహించి కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వనభోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గిరిబాబు, రాజ, గోపీ తదితరులు పాల్గొన్నారు.


సీతారామపురంలోని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

● **ఉదయగిరి:** మండలంలోని పలు ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయగిరి పట్టణంతో పాటు మండలంలోని లింగాలదొన, ఆర్లపడియ, గండిపాళెం, అప్పసముద్రం, సున్నంవారిచింతల తదితర గ్రామాల ఆలయాలకు భక్తులు చేరుకుని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, అడవిపేరంటాలమ్మ ఆలయంలో, గండిపాళెం జలాశయ ఆవరణలో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వనభోజనాల కార్యక్రమం చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

● **సీతారామపురం :** ఆఖరి కార్తీక సోమవారం కావడంతో మండలంలోని భైరవకోన, ఘటికసిద్ధేశ్వరం, సీతారామపురంలోని శివాలయాలలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక దీపాలను వెలిగించారు. సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫ్లోరిన్ రహిత నియోజకవర్గమే లక్ష్యం : కాకర్ల


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని ఫ్లోరిన్ రహిత నియోజకవర్గంగా తయారు చేయడమే లక్ష్యం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం వింజమూరు మండల పరిధిలోని చాకలికొండ పంచాయతీ పోలునాయుడుపల్లి గ్రామంలో రూ.8లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మహిళలకు బిందెలతో నీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామమైనందున వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలు, నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర పౌర గంథాలయ శాఖ సంచాలకులు కృష్ణమోహన్

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏ కృష్ణమోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఏ కృష్ణమోహన్ సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం వారు సందర్శించి పుస్తక, నాణాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటుకు కృషి చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కెవి శేషారెడ్డిని సన్మానించారు. ఈకార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు ఏ సుబ్బరాయుడు, ఎస్‌వి రమణయ్య, కొల్లా వెంకటేశ్వర్లు, విశ్రాంత గ్రంథ పాలకుడు ఏ గోవిందరెడ్డి, స్టూడెంట్స్ మోటివేటర్ వి నారాయణరావు, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ (థీమ్-5) అనే అంశానికి సంబంధించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అందులో భాగంగా తొలిరోజు సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 24న ఎమ్మార్సీలు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు, 28న వీవోఏలకు సంబంధించిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు శిక్షణ ఉంటుందన్నారు. కావున తప్పక హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి దుత్తలూరులో...

● **దుత్తలూరు(ఉదయగిరి):** క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ థీమ్-5 కార్యక్రమంపై ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్ చెంచమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 19న ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు, 20న నర్రవాడలోని చెత్తసంపద కేంద్రంలో ఎంఆర్‌సీలు, గ్రీన్‌అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులకు, 21న మండల పరిషత్ కార్యాలయంలో విలేజ్ ఆర్గనైజర్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

కుల్లూరులో వనభోజనాలు

కలువాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరు అభయ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ఫీజు నగదు అందజేత


ప్రధానోపాధ్యాయుడికి నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజు నగదును ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం నగదు అందజేశారు. ఈసందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టి లో ఉంచుకుని ఫీజు నగదును చెల్లించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే 331 మంది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు నగదు రూ.55,530 ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రియాజ్, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, తుమ్మల కిరణ్, ఓబులరెడ్డి, రామయ్య, లక్ష్మయ్య, గాజుల బాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


కుష్ఠు వ్యాధి సర్వేను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

సంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆశా కార్యకర్తలకు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని జండాదిబ్బలో నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధి ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తిని పీహెచ్‌సీ వైద్యుల వద్దకు పంపాలని సూచించారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే బహుళ ఔషధ చికిత్సతో నయం చేయవచ్చునని తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత రిపోర్టును వైద్యశాలలో అందచేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ ఉన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు

సీతారామపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు సూచించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఆయన సోమవారం మండల టీడీపీ బృందంతో కలిసి మండలంలోని అన్ని సచివాలయాలకు వెళ్లి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్నిరకాల సేవలను అందించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు మండల ప్రధాన కార్యదర్శి సుమన్‌బాబు, మండల యూత్ అధ్యక్షుడు వీకాష్‌బాబు, గ్రామ అధ్యక్షుడు పిడుగు రమేష్, షేక్‌బాబు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు


గడ్డంవారిపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామంలో ఆత్మనిర్భర భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంటింటికి స్వదేశీ వస్తువులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షురాలు విజయలక్ష్మీ, అడవిపేరంటాలమ్మ ఆలయ చైర్మన్ రవీంద్ర, బీజేపీ జిల్లా కార్యదర్శి రత్నంనాయుడు, ఉపాధ్యక్షురాలు శివపార్వతి, బీజేపీ నాయకులు గడ్డం ప్రసాద్, నారాయణరెడ్డి, మన్నేటి శ్రీనివాసులరెడ్డి, హరి, గడ్డం శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి వీడిన గ్రహణం

● రూ. 1.80 కోట్ల మంజూరు ● ఊపందుకోనున్న పనులు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా ఎదురుచూపులకే పరిమితమైన స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి ఎట్టకేలకు గ్రహణం వీడింది. ఆత్మకూరు పట్టణంలో అర్ధాంతంగా నిలిచిపోయిన స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ రూ. 1.80 కోట్లు మంజూరు చేసింది. త్వరలో స్పోర్ట్స్ స్టేడియం అందుబాటులోకి రానుంది. దీంతో యువతలో ఆశలు రేకెత్తాయి. యువత ఆశలను పరిగణలోకి తీసుకున్న ఆనం రామనారాయణరెడ్డి స్టేడియంను అన్ని హంగులతో పూర్తి చేసేందుకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ద్వారా నిధులు మంజూరు చేయించారు. బుధవారం మంత్రి ఆనం ఆత్మకూరుకు విచ్చేసి స్టేడియం ప్రాంగణాన్ని పరిశీలించనున్నారు. ఇప్పటికే ఆయన శాప్ అధికారులతో స్టేడియం మాస్టర్‌ప్లాన్, అంచనాలు, టెండరు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించి పనులు వేగవంతం అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.


ఆత్మకూరులో అసంపూర్తిగా నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులు

C.R.I.M.E N.E.W.S

మితిమీరిన వేగం.. పోయింది ప్రాణం!

● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సుహెల్ మృతదేహం

మనుబోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేతిలో హెవీ సీసీ బైక్...అందులో హైవే. పైగా మెకానిక్. ఇంకేముంది... మితిమీరిన వేగంతో దూసుకెళ్లాడు. నెల్లూరు నుం చి మనుబోలు వరకు క్షేమంగానే వెళ్లిన ఆ యువకుడు వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో వేగాన్ని అదుపు చేయలేకపోయాడు. మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఎస్కే సుహెల్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నెల్లూరు ప్రగతి నగర్‌లోని పొదల కూరు రోడ్డు సెంటర్‌కు చెందిన రహంతుల్లా, షమ్మాలకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రహంతుల్లా ఎంబ్రా యిడింగ్ పనిచేస్తుంటాడు. కుమారుడు సుహెల్ ఏడాదిన్నరగా ట్రయాంప్ అనే మోటార్‌సైకిల్ కంపెనీలో మెకానిక్ (హెల్పర్)గా పని చేస్తున్నాడు. సోమవారం సుహెల్ విధులకు హాజరు కాకుండా, పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై గూడూరుకు బయలుదేరాడు. వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఎగిరి అవతలి రోడ్డుపై పడ్డాడు. సరిగ్గా అదే సమయంలో అవతలి రోడ్డుపై వెళుతున్న కంటైనర్ వెనుక భాగాన సుహెల్ పడడంతో తల పగిలి దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. సుహెల్ హెల్మెట్ ధరించి ఉండి ఉంటే ప్రాణాలు దక్కేవని స్థానికులు చెబుతున్నారు.

అన్న హత్య కేసులో తమ్ముడికి జీవితఖైదు

నెల్లూరు(లీగల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం సొంత అన్నను తల మీద కొట్టి కిరాతకంగా హత్య చేసి ఇంటిని తగలబెట్టిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు పాముల శీనయ్యకు జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 3వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎల్ తేజోవతి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముత్తుకూరు మండలం రొయ్యలపాళెంకు చెందిన పాముల శీనయ్య, పాముల సుబ్రహ్మణ్యం అన్నదమ్ములు. వీరికి ఆస్తి విషయంలో వివాదం ఉంది. ఈక్రమంలో 2022 మే 7వ తేదీన ఉదయం రొయ్యలపాళెంలోనే ఇసుపరాడ్‌కు గుడ్డ చుట్టి అన్న సుబ్రహ్మణ్యంను తమ్ముడు శీనయ్య వెనుక నుంచి తలపై బలంగా కొట్టాడు. ఆ తరువాత ఇంటికి కూడా నిప్పు పెట్టాడు. గాయపడిన సుబ్రహ్మణ్యంను చికిత్స నిమిత్తం బంధువులు తొలుత నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నారాయణ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ముత్తుకూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో నిందితుడికి పై విధంగా జైలు శిక్షతోపాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం చెంచుకృష్ణ వాదించారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భర్త కన్పించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మన్సూర్‌నగర్‌లో షేక్ మోబీనా, బషీర్ అహ్మద్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. బషీర్ అహ్మద్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మోబీనా నగరంలో అత్త, మామ, మరదలతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో తొమ్మిది నెలలుగా భర్త ఇంటికి రావడం లేదు. బషీర్ అహ్మద్ తల్లిదండ్రులు ఫోన్ చేస్తున్నా ఆయన తీయడం లేదని, వారు బెంగళూరుకు వెళ్లి అతను పనిచేస్తున్న చోట విచారించగా అక్కడ అతను కనిపించలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదని భార్య చిన్నబజారు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

నెల్లూరు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితులు పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదులపై చిన్నబజారు పోలీసులు సోమావారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మూలాపేట బెస్తపాలెం ప్రాంతంలో గొల్ల కిషోర్‌బాబు, రాచమల్లి శ్రీనివాసులు నివాసం ఉంటున్నారు. వారివురు గత ఎన్నికల్లో కలిసి పనిచేశారు. అయితే కొంతకాలంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలో ఈనెల 16వ తేది సాయంత్రం లిటిల్ ఏంజెల్స్ పాఠశాల వద్ద ఒకరిపై ఒకరు దాడి చేశారంటూ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతుండిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. సంగం ప్రాంతానికి చెందిన నారాయణ(35) కొంత కాలంగా సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులో, మరే ఇతర కారణాలతోనో ఆదివారం ఆయన సుందరయ్యకాలనీ సమీపంలోని దుకాణాల వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న వేదాయపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● **పెంచలకోనలో..**

రాపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో టిటిడి కల్యాణ మండపం సమీపంలో సోమవారం ఓ గుర్తు తెలియని యాచకుడు (58) మృతి చెందాడు. ఆధారాలు లభించక పోవడంతో రాపూరు పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

నెల్లూరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తనకు చెందిన స్థలంలో అక్రమంగా ప్రవేశించడంతో పాటు తనపై దాడి చేశారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని ములుముడికి చెందిన బండి సంపూర్ణమ్మకు చెందిన స్థలంలో సమీప బంధువులైన బండి మల్లికార్జున్, ఆయన భార్య లక్ష్మిలు అక్రమంగా ప్రవేశించి ఇల్లు నిర్మించేందుకు 13వ తేదీన యత్నించారు. ఈ క్రమంలో ఆమె వారివురుని అడ్డుకోగా వారు తనపై కాళ్లు, చేతులతో దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కలువాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చీటీ డబ్బులు ఇవ్వలేదని నిర్వాహకుడు ఇంటికి వచ్చి తనతో పాటు కుటుంబ సభ్యులను కూడా దూషించాడని కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి జంగాల కాలనీకి చెందిన తిరుపతి విక్రమ్ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన కలువాయిలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... విక్రమ్ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద చీటీ వేసి పనులు లేక డబ్బులు చెల్లించకపోవడంతో నిర్వాహకులు ఇంటికి వచ్చి తిట్టారు. దీంతో మనస్థాపం చెందిన విక్రమ్ సోమవారం ఉదయం కలువాయికి వచ్చి కలువాయమ్మ ఆలయం వద్ద పురుగుల మందు తాగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు అతడిని వైద్యశాలకు తరలించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 635

నిత్యావసర సరుకుల పంపిణీ

అల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పడమర గోగులపల్లి చింతచెట్టు కాలనీలో గిరిజనులకు సోమవారం ఏఆర్‌డీ సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకులను సర్పంచి ఆట తిరుమల పంపిణీ చేశారు. గిరిజనులకు ఏఆర్‌డీ సంస్థ చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోట శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న సర్పంచి తిరుమల

సమస్యలను సకాలంలో
పరిష్కరించాలి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ పీ చంద్రబాబునాయుడు, సర్పంచి మాచర్ల, అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీలలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ సురేష్ బాబుకు సూచించారు. పింఛన్ సమస్యలను సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాలకు వెళ్లి పరిష్కరించాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు రూ. 5 కోట్లకుపైగా నిధులు వెచ్చించి సీసీ రోడ్లు వేయించామని, త్వరలో మరో రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 60 అర్జీలు వచ్చాయని, వీటిని ఆన్‌లైన్లో నమోదుచేసి సత్వరమే పరిష్కరించేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. స్థానిక పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పోలినేని రమేష్ కోరారు.

● **టీడీపీలో చేరిక**

స్థానిక బీసీ కాలనీలో యాదవ సామాజిక వర్గానికి చెందిన సుమారు 100 మంది వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సురేష్ సమక్షంలో కన్వీనర్ చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా లక్ష్మీనరసింహులు, దామా మహేశ్వరరావు, దాసరి అశోక్, బద్దిపూడి మాచర్ల, బీ హరిబాబు, కుంకు మోహనరావు, అల్లిక మధు, తాటికొండ అనూష, చిమ్మిలి శ్రీదేవి, చిమ్మిలి రాంబాబు, దొడ్ల తిరుపతినాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను తొలగించడం అన్యాయం



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘం నేతలు

కావలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పారిశుధ్య నిర్వహణకు కాంట్రాక్ట్ పద్ధతిలో గత ప్రభుత్వం నియమించిన 19 మంది కార్మికులను తొలగిండం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్మికులను తొలగించటం వల్ల అంబేద్కర్ విగ్రహ నిర్వహణను గాలికి వదిలేసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతి, ఎమ్మార్పీఎస్ నాయకులు జరుగుమలి విజయరత్నం, నరసింహారావు, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, సేననేత మస్తానయ్య పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


సాధించిన బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కావలి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొత్తపల్లి శ్రీ వేదం విద్యాలయం కరస్పాండెంట్ పంగులూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో చాంపియన్లుగా నిలిచిన 9వ తరగతి విద్యార్థులు ఆర్ చరణ్, ఏ చరణ్‌లను అభినందించారు. అన్ని విభాగాల్లో కలిపి 13 ప్రథమ బహుమతులు, 6 ద్వితీయ బహుమతులు, ఒక తృతీయ బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు శోచనీయం

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, క్రీమీలేయర్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు శోచనీయమని అఖిలభారత మాలసంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతిలో న్యాయవాదుల సదస్సులో పాల్గొన్న జస్టిస్ గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాల్సిందేనని వ్యాఖ్యానించటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకమని పేర్కొన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికే చెందిన గవాయ్ పూర్తిగా అమలుపరచని రిజర్వేషన్ల గురించి కానీ, జనాభా ప్రాతిపదికన పెంచాల్సిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల గురించి కానీ, ఇప్పటివరకు ప్రాతినిధ్యంలేని శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని రిజర్వేషన్ల గురించి కానీ, ప్రైవేటురంగంలో పూర్తిగా ఎత్తివేస్తున్న ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల గురించి కానీ కనీసం ప్రస్తావించకుండా క్రీమీలేయర్ గురించి మాత్రమే మాట్లాడటం శోచనీయమని పేర్కొన్నారు.

పర్యావరణ అనుమతులు ఇవ్వడం దారుణం

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వాస్తవ పరిస్థితులు చూడకుండా బీపీసీఎల్ ప్రాజెక్టు ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు ఇవ్వడం దారుణమని ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అత్యధిక వాయుకాలుష్యం ఉండే బీపీసీఎల్ ప్రభావం చుట్టూ 20 కి.మీటర్ల వరకు తీవ్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ కనిపించటం లేదన్నారు. అంతేగాక పర్యావరణ నివేదికలో వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల వారు ఎవరూ ఉపాధి కోల్పోవడం లేదని పేర్కొనటం సిగ్గుచేటన్నారు. భూసేకరణ వలన ఉపాధి కోల్పోయే కుటుంబాల పూర్తిజాబితా విడుదల చేయాలని, వారు కోల్పోయే జీవితకాలం ఆదాయం ఆధారంగా న్యాయమైన పరిహారం ఇవ్వటంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధికి ప్రభుత్వం హామీ ఇవ్వాలని నేతి మహేశ్వరరావు డిమాండ్ చేశారు.

చెట్ల కొమ్మల నరికివేత అడ్డగింత

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో ఉన్న వేపచెట్ల కొమ్మలను నరుకుతుండగా సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే దివి శివరాం అడ్డుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌లో కొన్ని గదుల నిర్మాణానికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా ఎవరి అనుమతితో కొడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేస్తూ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

రన్నింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మజ్దూర్ యూనియన్ సభ్యులు

బిట్రగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఐఆర్ఎఫ్ పిలుపు మేరకు బిట్రగుంట రైల్వే క్రూబుకింగ్ లాబీ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ చైర్మన్ ఎంవీ శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెరిగిన డీఏకు అనుగుణంగా మైలేజ్ అలవెన్స్ పెంచాలన్నారు. పెండింగ్ డీఏ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వీఎస్ బాబు, ఆర్వీ నరసయ్య, డీ నవీన్, శ్రీహరి, విజయ్, రాజీవ్, మరియబాబు తదితరులు ఉన్నారు.

నేడు కావలి మండల సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావే శం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నిర్మూలన, ఉపాధిహామీ పనులు తదితర అంశాలపై ఉదయం 11 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యుడితోపాటు సర్పంచిలు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

అలంకారప్రాయంగా ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్

ఏరియా వైద్యశాలలో నాలుగు నెలలుగా తాగునీటి అవస్థలు


ఖాళీ బాటిల్‌తో వెనుదిరిగి వస్తున్న రోగి సహాయకుడు

కావలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా వైద్యశాలలో ప్యూరిఫైడ్ వాటర్ యూనిట్ మోటారు, కాపర్ వైర్లు నాలుగు నెలల కిందట చోరీకి గురయ్యాయి. అప్పటి నుంచి రోగులు, వారి సహాయకులు తాగు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఓపీ హాలు వద్ద తాత్కాలికంగా వాటర్ క్యాన్ల ద్వారా కొంత మేర మంచినీరు అందిస్తున్నా ఓపీ సమయం దాటిన తర్వాత తాగునీటి కోసం అవస్థలు తప్పడం లేదు. కాగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు బీఎంఆర్ ట్రస్టు నిధులతో ఆస్పత్రిలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. అయితే కాపర్ వైర్లను దొంగలు తీసుకెళ్లినప్పటి నుండి వాటర్ ప్లాంటు పని చేయడం లేదు. మరమ్మతుల విషయంలో వైద్యాధికారులు తగిన శ్రద్ధ చూపక పోవటంతో తాగునీటి కోసం రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాలలో తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

ప్రభుత్వ వైద్యశాలలో వాటర్ ప్యూరిఫైడ్ యూనిట్ మోటారు, ఏసీల కాపర్‌వైర్లు చోరీ అయ్యాయని ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా పోలీసులు, వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని రోగులు, వారి సహాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా కొత్తవి అమర్చాలన్నారు.

లక్ష్యసాధనకు క్రీడలు దోహదపడతాయి

● వీఎస్‌యూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ● కావలి జేబీలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

కావలి (టౌన్) నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనకు క్రీడలు దోహదపడతాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డాక్టర్ డీ ఆర్ క్రీడా ప్రాంగణంలో సోమవారం వీఎస్‌యు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ సభకు జేబీ కరస్పాండెంట్ వేణుంబాక సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఉప కులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకట్రాయలు పాల్గొన్నారు. వీసీ, రిజిస్ట్రార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, నిబంధనలతో సంబంధం లేకుండా ప్రభుత్వం వారిని ఉన్నత పదవు ల్లో నియమించి, సత్కరిస్తుందన్నారు. రిజిస్ట్రార్ కె సునీత మాట్లాడుతూ క్రీడాకారులకు వీఎస్‌యు మంచి అవకాశాలు కల్పిస్తోందని, ప్రతి ఏటా క్రీడాకారుల సంఖ్య పెరగాలని కోరారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పురుషుల వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, టీటీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, దాదాపు 18 కళాశాలల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వర్సిటీ జట్లకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, అబ్జర్వర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు రూ. లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న వెంకటసాయి సత్య శ్రీరాజ్

కావలి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ కేంద్రం నిర్మాణానికి కావలి ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు గాదంశెట్టి మధుసూధనరావు లక్ష రూపాయలు విరాళాన్ని తన కుమారుడు వెంకటసాయి సత్య శ్రీరాజ్ జన్మదినం సందర్భంగా అందజేశారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాలకమండలి సభ్యుల సమక్షంలో రెడ్‌క్రాస్ కోశాధికారి అరికట్ల మధుసూదనరావుకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసాయి సత్యశ్రీరాజ్, చరిత దంపతులను రెడ్‌క్రాస్ బాధ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, రెడ్‌క్రాస్ బాధ్యులు కే. హరినారపరెడ్డి, ఏ రమేష్‌రెడ్డి, నల్లూరు రవికుమార్, వెంకటసుబ్బయ్య, కలికి శ్రీహరిరెడ్డి సురేష్ రెడ్డి, ఆర్యవైశ్యసంఘం డైరెక్టర్ తటవర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తా!

● అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని సండేమార్కెట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అండర్ బ్రిడ్జి వద్ద రూ.1.02 కోట్లతో రోడ్డు ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. వర్షాలు వస్తే సండేమార్కెట్లో నీరు నిలిచి సమస్యలు వస్తున్నందున అక్కడ కూడా శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నేతలు తాళ్లపాక అనురాధ, మధు, సుజనాకుమార్ పాల్గొన్నారు.

● **15 హైస్కూళ్లను అభివృద్ధి చేస్తాం**

నెల్లూరు(విద్య): నెల్లూరులో వీఆర్ హైస్కూల్ తరహాలోనే మరో 15 మున్సిపల్ హైస్కూళ్లను అభివృద్ధి చేస్తామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని కర్నాలమిట్ట మున్సిపల్ హైస్కూల్, బీవీఎస్ హైస్కూల్, చిన్నబాలయ్య హైస్కూల్, వైవీఎం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఎన్నికల హామీ మేరకు మరో 15 హైస్కూళ్లను బాగు చేస్తామని చెప్పారు.

కోదండ రామాలయంలో లక్ష దీపోత్సవం


రుద్రాభిషేకం కార్యక్రమానికి హాజరైన భక్తులు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపోత్సవాలు నిర్వహించారు. పెద్దబజారులో ఉన్న కోదండ రామాలయంలో లక్షదీపోత్సవం, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో ప్రత్యేకంగా శివలింగాన్ని ఏర్పాటుచేసి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలోను కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు శివలింగం, ఢమరుకం, త్రిశూలం ఆకారాలలో దీపాలను వెలిగించి శివలింగాన్ని పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ దాడులు

● 38 మందిపై కేసుల నమోదు ● రూ.5.43 లక్షల అపరాధ రుసుం విధింపు


విజిలెన్స్ దాడుల వివరాలు తెలుపుతున్న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకకాలంలో విద్యుత్‌శాఖ 32 బృందాలతో సోమవారం విస్తృత దాడులు నిర్వహించి 38 మందిపై కేసులు నమోదు చేసింది. ఒంగోలు విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డీపీఈ హైమావతి, కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరయ్యలు తమ సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్న 38 మందిపై వివిధ కేసులు నమోదు చేసి రూ.5,43,000 అపరాధ రుసుము విధించినట్లు పేర్కొన్నారు. మీటరు ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మందిపై రూ.40,000, అనుమతి కన్నా అధిక కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న వ్యక్తిపై రూ.5000, అనుమతికి మించి అదనంగా విద్యుత్ వాడుతున్న 26 మందికి రూ.4,98,000 అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ విద్యుత్ వాడకానికి సంబంధించి ఫిర్యాదు చేయదలచినవారు 9440812358, 9440812359 నెంబర్లకు వాట్సప్ ద్వారా సమాచారం తెలియచేయాలన్నారు. విజిలెన్స్ దాడులు నిర్వహించిన వారిలో సింగరాయకొండ డీఈఈ యుగంధర్, ఉలవపాడు ఏఈ పీ సాయిబాబు, లైన్‌మెన్‌లు సత్యన్నారాయణ, మీరావలి, కందుకూరు, సింగరాయకొండ సబ్ డివిజన్‌కు చెందిన ఏడీఈ, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను తప్పుదారి పట్టిస్తున్న వైసీపీ నాయకులు


విలేకరులతో మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, వైసీపీ నాయకులు రైతులను తప్పుదారి పట్టిస్తోందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు విమర్శించారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా అంతంతమాత్రంగా అందజేస్తున్నారంటూ వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. నాగులవరం పంచాయతీలో 18 మెట్రిక్ టన్నుల యూరియా ప్రస్తుతానికి అందుబాటులో ఉందని మాలేపాటి అన్నారు. రైతుల అవసరాన్ని బట్టి మండలంలో 360 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఈ నెల మొదటి వారం నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. వైసీపీ నాయకుడు మూడుచోట్ల పొలాలకు 120 బస్తాల యూరియా తీసుకున్న సంగతి మరిచినట్లున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి ఏఎంసీ డైరెక్టర్లు గణేషం రమేష్‌రెడ్డి, లేల్లపల్లి సుధీర్‌బాబు, టీడీపీ రైతు సంఘం నాయకులు కోట్టా వెంకారెడ్డి, వై. వెంకటేశ్వర్లు, పుట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు మూడు బస్తాల ఎరువులు


యూరియా పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి

బిట్రగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రైతు పక్షపాతి అని, వారి అవసరాలు తెలుసుకుని పార్టీలకు అతీతంగా యూరియ అందజేస్తున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలు మండలంలోని పలుచోట్ల సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులు ఎకరాకు మూడు బస్తాల చొప్పున దశలవారీగా యూరియాను పొందవచ్చున్నారు. బోగోలు- 1, బోగోలు -3 సచివాలయాల పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గనిపినేని నాగరాజు, పోతల శ్రీనయ్య, ఏఏవో హారిణి, రైతులు పాల్గొన్నారు.

రేపు లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి జ డ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్సు రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో ప్రైవేటు వ్యాపారులు ఎవరైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏడీఏ కేవీ శేషారెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన యూరియా కొరత వెంటాడుతోంది కథనానికి ఆయన స్పందించారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి రైతు సేవాకేంద్రాల ద్వారా యూరియా, ఇతర ఎరువులు ఇండెంట్లపై తెప్పించి రైతులకు ఎంఆర్‌పీకే అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఇండెంట్లు పెట్టి ఆర్ఎస్‌కేల ద్వారా ఎరువులు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్), (ఆంధ్రజ్యోతి) : తిరుపతి బార్ అసోసియేషన్ మెంబర్ ఏ.రాజశేఖర్‌రెడ్డిపై పుత్తూరు కోర్టులో ప్రతివాది హత్యాయత్నానికి ప్రయత్నించడానికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలియచేయనున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప




తిరుపతిలోని కపిలేశ్వరాలయానికి సోమవారం అయ్యప్ప మాల ధరించిన భక్తులు పోటెత్తారు. కపిలతీర్థంలో వీరు స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తీక మాసం చివరి సోమవారంతో అధిక సంఖ్యలో స్థానిక భక్తులూ రావడంతో రద్దీగా మారింది.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కార్తీక వెలుగులు



తిరుపతి కపిలేశ్వరాలయం పక్కన ఉద్యానవనంలో..



శ్రీకాళహస్తిలో ముక్కంటి ఆలయం వద్ద..

కార్తీక మాసం చివరి సోమవారం. దీంతో శివాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో రద్దీగా మారాయి. ఆయా ఆలయాల వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. ఈ కార్తీక దీపాలతో ఆలయాలు వెలుగులీనాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం, కపిలేశ్వరాలయం వద్ద రద్దీకి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

దేవతలారా రారండి

● పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వేడుకగా ధ్వజారోహణం

తిరుచానూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సకల దేవతలు అతిథులుగా వచ్చారు. భక్తులు ఆనందపరవశం కాగా ధ్వజపటం పైకి ఎగిరింది. బ్రహ్మాండనాయకుడి ప్రియదేవికి పద్మావతి బ్రహ్మోత్సవం మొదలైంది. తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేందుకు సోమవారం ఉదయం ధ్వజస్తంభం ఎదుట పూజలు చేశారు. సకలదేవతామూర్తులను పండితులు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6 గంటలకు చక్రాత్తాళ్వార్ ముందుకు సాగగా వెనకే అమ్మవారికి అభిముఖంగా గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి అంకురార్పణ సందర్భంగా యాగశాలలోని కలశాల్లో నింపిన నవధాన్యాలు అంకురించాయి. వీటిని తీసుకొచ్చి ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. 9.30 గంటలకు ధనుర్లగ్నంలో వేడుకగా ధ్వజారోహణం చేశారు. కంకణభట్టారు వేంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ క్రతువు జరిగింది. మాడవీధుల్లో భక్తులందరూ అమ్మవారి వాహనసేవ తిలకించేలా ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జియ్యర్‌స్వాములు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచారులుబాబు స్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు పెద్దశేష.. రాత్రి 7 గంటలకు హంస వాహనాలపై అమ్మవారు ఊరేగనున్నారు.



చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

చిన్నశేషుడిపై అమ్మ చిద్విలాసం

తొలిరోజైన సోమవారం రాత్రి 7 గంటలకు అమ్మవారు పరమ వాసుదేవుడు అలంకారంలో చిన్నశేష వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవ ముందు కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. కాగా, మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారికి శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో స్నపన తిరుమంజనం.. ఆస్థాన మండపంలో సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.



వజ్రకిరీటం, లక్ష్మీహారంతో అమ్మవారి దర్శనం

అమ్మవారి మూలమూర్తికి శుక్రవారం వజ్రకిరీటం, సహస్ర నామాలు కలిగిన బంగారు లక్ష్మీకాసుల హారం, లక్ష్మీనారాయణ కాసుల హారం అలంకరించారు. విశేష పర్వదినాల్లో మాత్రమే అమ్మవారికి వజ్రకిరీటం అలంకరించడం పరిపాటి. ఇక, బ్రహ్మోత్సవాల సమయంలో అమ్మవారి ఉత్సవర్లు అద్దాల మండపంలో కొలువై ఉంటారు.

తిరుచానూరులో తిరుమల లడ్డూలు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తిరుమల శ్రీవారి లడ్డూలను తిరుచానూరు ఆలయంలో అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల కౌంటర్‌లో టికెట్లు తీసుకుని.. బయట కౌంటర్‌లో లడ్డూలు పొందాలని ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి సాయంత్రం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆయనకు పూర్ణకుంభం స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ఆలయాల్లో భక్తుల రాక గణనీయంగా పెరిగిందన్నారు. మంత్రి ఆనంతో పాటు చంద్రగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ తదితరులున్నారు.

'ఐఎస్‌వో' పంచాయతీగా మేనకూరు!



నాయుడుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ(ఐఎస్‌వో) గుర్తింపులో భాగంగా తొలి దశలో మేనకూరు పంచాయతీ ఎంపికైంది. ప్రజలకు అందిస్తున్న పౌరసేవలు, ఫైల్స్ నిర్వహణ, సుపరిపాలన, ఘన వ్యర్థాల నిర్వహణ, పాలనలో పారదర్శకత, ధ్రువపత్రాల జారీ, జవాబుదారీతనం.. ఇలా 32 అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచే పంచాయతీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ కానుంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా 25 పంచాయతీలను గుర్తించగా అందులో మేనకూరు ఉంది. ఈ పంచాయతీకి తగిన వనరులు.. సమీపాన పారిశ్రామిక వాడ ఉండటంతో ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ అయ్యే దశలో ఉంది. పంచాయతీలో 31 సేవలను ప్రజలకు ఎటువంటి జాప్యం లేకుండా, కార్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా సదుపాయాలను సమకూర్చాల్సి ఉంది. కార్యాలయంలో కనిష్ఠంగా 20 సంవత్సరాల నుంచి వివిధ సర్టిఫికెట్లను భద్రపరచడం, వాటిని డిజిటలైజ్ చేయడం, ప్రజలకు మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, బాలింతల పిల్లలకు పాలుఇచ్చే సౌకర్యవంతమైన గది, దివ్యాంగులకు సరైన వసతి వంటివి ఏర్పాటు చేయాలి. సిబ్బందికి అవసరమైన స్టేషనరీ అందుబాటులో ఉండాలి. వీటన్నింటినీ త్వరలో బృందం పరిశీలించి, ఐఎస్‌వో ప్రమాణాల మేరకు గుర్తించి ధ్రువపత్రాల జారీకి సిఫార్సు చేయనుంది.

రాష్ట్రపతి పర్యటనలో అప్రమత్తంగా ఉండండి

రేణిగుంట/తిరుపతి(కలెక్టరేట్)/తిరుమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సాగే రేణిగుంట విమానాశ్రయం, తిరుచానూరు, తిరుమలను ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం వస్తుండటంతో ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. తిరుచానూరులో పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రొటోకాల్ విధులను నిర్వహించాలన్నారు. ఎయిర్‌పోర్టులో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు, విమానాశ్రయ డైరెక్టర్ భూమినాథన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత వీరు తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి భద్రతాపరంగా చేపట్టాల్సిన వివిధ చర్యలపై పద్మావతి అతిథిగృహంలో చర్చించారు. కాగా, రాష్ట్రపతి 20న మధ్యాహ్నం 3.20 గంటలకు రాష్ట్రపతి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని.. తర్వాత తిరుచానూరులో అమ్మవారిని దర్శించుకుని తిరుమల చేరుకుంటారు. 21న ఉదయం 9.30గంటలకు శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు.



తిరుమలలో అధికారులతో చర్చిస్తున్న అదనపు ఈవో

ఉన్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే మార్గం

● ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సభలో వక్తల మనోభావం



అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమున్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే చక్కటి మార్గాన్ని నిర్దేశిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగం- ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంయుక్తంగా మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. 'లైబ్రరీ-2047: డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్' అంశంపై శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర వహించాల్సి ఉందన్నారు. గ్రంథాలయాలున్న ప్రాంతాల్లో మనుషుల్లో అవగాహన, చైతన్యం ఎక్కువగా కనిపిస్తాయని శ్రీలంక యూనివర్సిటీ వీసీ కొలిత్ వీజే శేఖర్ అభిప్రాయపడ్డారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు సూచించారు. మంచి కెరీర్‌తో పాటు మంచి విలువలను పాటించాలంటే మంచి పుస్తకాలను చదవాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల్లో, గ్రామాల్లో, పట్టణాలు, నగరాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమే కాదు, ఆధునిక కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వీసీ ఉమాకంజిలాల్ కోరారు. గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయవలసిన అవసరం ఉందని ఇన్‌ఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ దేవకిమదల్లి చెప్పారు. సకాలంలో, సక్రమంగా గ్రంథాలయాల ద్వారా పౌరులకు సమాచారం అందితేనే ప్రజాస్వామిక.. మానవీయ విలువలు పెంపొందుతాయని అంతర్జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు పేర్కొన్నారు. పాఠకుల ఆదరణకు నోచుకునేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దాలని ఇన్‌ఫ్లిబ్‌నెట్ కేంద్ర ప్రతినిధి సురభి కోరారు. ఐటీతో గ్రంథాలయాలు కొత్త మార్గంలో గమనాన్ని సాగిస్తున్నాయని ఇన్‌ఫ్లిబ్ నెట్ ప్రతినిధి సుదర్శనరావు తెలిపారు. ఈ సదస్సుకు 500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్ చేశారు. దేశంలోనే సీనియర్ లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్ కరిసిద్ధప్పను, ఎస్వీ పాలిటెక్నిక్ లైబ్రేరియన్ నటరాజ నాయుడును సత్కరించారు.

సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం



ఈ సదస్సు సందర్భంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 1.3 లక్షల పుస్తకాలను సేకరించి, భద్రపరిచి, డిజిటలైజేషన్ చేస్తున్న లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పాండ్ర సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో లంకా సూర్యనారాయణను సన్మానించారు. గ్రంథాలయానికి, పుస్తక విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన కృషి రాబోయే తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సాహిత్యవేత్తలు కోట పురుషోత్తం, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పేర్కొన్నారు.

వచ్చే ఏడాది నా పెళ్లి

● స్పష్టతనిచ్చిన హీరో సాయి దుర్గ తేజ్



మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు, హీరో సాయి దుర్గ తేజ్ తన పెళ్లి గురించి తిరుమలలో స్పష్టతనిచ్చారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయనను ఆలయం ముందు మీడియా, వివాహం ఎప్పుడు చేసుకుంటున్నారని అడగడంతో 'వచ్చే ఏడాదిలో ఉంటుంది' అని చెప్పారు. గత కొద్దిరోజులుగా సాయి దుర్గ తేజ్ పెళ్లిపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కాగా వచ్చే ఏడాది వేసవిలో తన 'సంబరాల ఏటిగట్టు' సినిమా అభిమానుల ముందుకు రానుందని తెలిపారు. ఆయన్ను చూసేందుకు, సెల్ఫీలకోసం అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





శుక్రవారపుతోటలో

ఫలపుష్ప సోయగం









పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని అమ్మవారి శుక్రార పుతోటలో టీటీడీ ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ధ్వజారోహణం అనంతరం ఈ ప్రదర్శనను ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ప్రారంభించారు. వివిధ పురాణ ఘట్టాలపై ఏర్పాటు చేసి మూర్తులు విశేష ఆకర్షణగా మారాయి. నరకాసురుని సంహరిస్తున్న సత్యభామ, పాలకడలిలోని మహావిష్ణువును కాలితో తన్నుతున్న భృగుమహర్షి, వామన అవతారంలో బలి చక్రవర్తిని పాతాళ లోకానికి పాదంతో తొక్కుతున్న దృశ్యం, తాటకిని సంహరిస్తున్న శ్రీరాముడు, శ్రీపద్మావతి, శ్రీనివాసుల కల్యాణ వైభోగం, అష్టలక్ష్మీవైభవం.. వంటివి సెట్టింగ్స్ వేసి కళ్లముందు సాక్షాత్కరించేలా చేశారు. గజేంద్రమోక్షం సైకిత శిల్పం ఏర్పాటు చేశారు. అదే విధంగా కూరగాయల రూపొందించిన దేవతామూర్తుల మండపం ఆకర్షణీయంగా ఉంది. చామంతి, రోజా, పెట్రోనియా, బిగోనియా, సాల్వియా వంటి పూలతో రూపొందించిన ఏనుగు, కలశం, సీతాకోకచిలుక, డాల్ఫిన్‌లు ఆకట్టుకుంటున్నాయి. 25 వేల సీజనల్ ఫ్లవర్స్, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నారు. ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్పప్రదర్శనశాలను తీర్చిదిద్దారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేదం వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, వన మూలికల ప్రదర్శన,పుస్తక ప్రదర్శనలను కూడా ఈవో ప్రారంభించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు డాక్టరేట్



మారుతీ ప్రసాద్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

తిరుమలలో ప్రముఖుల సందడి

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్ కుమార్, ఇన్ఫోసిస్ సంస్థ చైర్‌పర్సన్ సుధా నారాయణమూర్తి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజజేంద్రప్రసాద్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పీ చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, జస్టిస్ టీ వినోద్‌కుమార్, సుధా నారాయణమూర్తి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,004

తలనీలాలు సమర్పించినవారు: 23,900



తిరుమలలో 'ప్రేమంటే' హీరో, హీరోయిన్‌లు



తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): 'ప్రేమంటే' సినిమా బృందం సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. హీరో ప్రియదర్శి, హీరోయిన్ ఆనంది, ఆ చిత్ర నిర్మాత పుష్కర్ రామ్మోహన్‌రావుతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 21న తమ చిత్రం విడుదల కానున్న సందర్భంగా స్వామిని దర్శించుకుని విజయం ప్రసాదించమని కోరుకున్నామన్నారు.

తిరుమలలో పెజవర మఠాధిపతి



ఉడిపిలోని పెజవర మఠాధిపతి విశ్వేషప్రసన్న తీర్థస్వామిజీ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న మఠాధిపతికి ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి అర్చక బృందంతో కలిసి ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తా: చిత్తూరు ఎంపీ



తిరుపతి/తిరుపతి(జీవకోన), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం చిత్తూరులో ఆయన్ను కలిసి సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ని కూడా కలిసి సాధన సమితి నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సాధన సమితి నాయకులు వైయస్ బాబు, బుజ్జి బాబు నాయుడు, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వికేంద్రీకరణతో అభివృద్ధి

● వైజాగ్ సీఐఐ సమ్మిట్ సక్సెస్ వెనుక బాబు, లోకేశ్ కృషి



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తిరుపతి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి, అభివృద్ధి వికేంద్రీకరణకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ కృషిచేస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యేలు సునీల్ (గూడూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. వైజాగ్‌లో జరిగిన సీఐఐ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా గురువారం వీరు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సీఐఐ సదస్సు దేశాన్ని ఆకర్షించిందని, రూ13లక్షల కోట్లు పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలు సీఐఐ సదస్సు అందించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదన్నర లోపే డబుల్ ఇంజిన్ సర్కార్ కావడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవాటిని తరిమికొట్టారని మండిపడ్డారు. నాయకత్వంపై నమ్మకం ఉండడం వలనే పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడమే కాకుండా 21 రోజుల్లో సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నారన్నారు. టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై వైసీపీ నాయకులు దొంగేదొంగ అన్నట్టుగా ఉందన్నారు. వైఎస్ వివేకా, పరిటాల రవి హత్యకేసులో సాక్షులు చనిపోయినట్టుగా పరకామణి చోరీ కేసులో ఆధారాలను వైసీపీ నేతలు చెరపేస్తున్నారని ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.





మంచు తెరలను చీల్చుకుని బయటికి వస్తున్న భానుడు....నీటిలోపలున్న చేపలు పైకి వచ్చి సలసలమని పరిగెడుతున్న ధ్వనులు... ఆ చేపలను పట్టుకోవడానికి కొంగల ప్రయత్నాలు.... చిత్తూరు గంగినేని చెరువు కట్ట పై సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న వారికి ఆహ్లాదాన్ని మిగిల్చిన దృశ్యాలివి.

దీర్ఘకాలిక విద్యుత్తు సమస్యలను నా దృష్టికి తీసుకురండి

● 'డయల్ యువర్ సీఎండీ'లో వినియోగదారులకు శివశంకర్ సూచన



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు17(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు చిన్నవాటితో పాటు పెద్దసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే త్వరితగతన పరిష్కరించే అవకాశం ఉంటుందని సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ పరిధిలోని జిల్లాల నుంచి 67 మంది ఫిర్యాదులు చేసినట్లు ఆయన తెలిపారు. కరెంటు సర్వీసులు మంజూరు చేయాలని, కాలిపోయిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలని, విద్యుత్ లైన్ల మార్పు, లోఓల్టేజ్ సమస్య, సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైనవి మినహా మిగిలిన వాటిని పరిష్కరించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, సీజీఎం జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల వితరణతో విద్యా వసతులు

● రూ.58 లక్షలతో సత్యవేడులో కళాశాల హాస్టల్, వానెల్లూరులో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం



సత్యవేడులో హాస్టల్ భవనం ప్రారంభించాక శ్రీసిటీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రతినిధులు

సత్యవేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్వీ పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా రూ.58 లక్షలతో నిర్మించిన నూతన విద్యా వసతులను ఆయా సంస్థల ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. సత్యవేడులో రూ.46 లక్షలు వెచ్చించి 3 విశాల గదులతో నిర్మించిన బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనాన్ని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా, శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి సోమవారం ఉదయం ప్రారంభించారు. సంస్థ డీజీఎం వెంకటేష్, సీఎస్ఆర్ కమిటీ సభ్యులు మల్లీశ్వరన్, పృథ్వీ, మహేష్, ప్రసాద్, శ్రీకాళహస్తి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మునీంద్ర, వార్డెన్లు రామయ్య, గంగాధరం పాల్గొన్నారు.

● శ్రీసిటీలోని చార్ట్-వీఆర్వీ పరిశ్రమ రూ.12 లక్షలతో సత్యవేడు మండలం వానెల్లూరులో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, వంట గదులను వీఆర్వీ సంస్థ డైరెక్టర్(హెచ్ఆర్) యామిని సిన్హా, తయారీ విభాగం హెడ్ ప్రసంజిత్ ప్రారంభించారు. ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్వీ సంస్థల సీఎస్ఆర్ చర్యలను శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్)నిరీషా సన్నారెడ్డిఅభినందించారు. ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

కోర్టులో లొంగిపోయిన మాజీ సీఈవో జగదీశ్

భాకరాపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సహకార సంఘంలో రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన మాజీ సీఈవో జగదీశ్ సోమవారం పీలేరులోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండు విధించిందన్నారు. సహకార సంఘంలో వన్ గ్రాము గోల్డు ఆభరణాలు తాకట్టు పెట్టి 2022 నుంచి 2025 వరకు రూ.72 లక్షల మేరకు సీఈవో ద్వారా కె.రెడ్డమ్మ, సి.రుతున్‌కు రుణాలు మంజూరు చేశారు. ఈ నెల 4న డీసీసీ బ్యాంకు మేనేజరు పరిశీలనలో ఈ విషయాన్ని గుర్తించారు. బాధ్యులైన సీఈవో, అప్రైజరు, అప్పటి పాలకవర్గం, పర్సన్ ఇన్‌ఛార్జ్‌పై చర్యలు తీసుకోవాలన్న సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితమే అధికారులు జగదీశ్‌ను సస్పెండ్ చేశారు. కేసు నమోదు చేశాక పరారీలో ఉన్న జగదీశ్ సోమవారం కోర్టులో లొంగిపోయాడు.

ఫిర్యాదుదారులను తిప్పించుకోవద్దు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 313 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి. పరిష్కారం కానివాటికి ఆయా ఫిర్యాదుదారులకు నివేదిక పంపండి. అంతేకానీ ఫిర్యాదుదారులను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు' అంటూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు పలు సమస్యలపై 313 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపై ఒక రెవెన్యూశాఖకే 199అర్జీలు రావడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

పింఛను ఇప్పించండి



నా అనే వారు నాకెవరూ లేరు. వృద్ధాప్యం కారణంగా నడవలేని పరిస్థితి. కంటిచూపు మందగించింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- అచ్చయ్య, బావాజీ కాలనీ, సూళ్లూరుపేట

మమ్మల్ని ఆదుకోండి



ఓళ్లూరు రాయలచెరువు కట్ట తెగి వరద ప్రవాహానికి ఇళ్లు, పొలాలు దెబ్బతిన్నాయి. మాకు జీవనాధారమైన వ్యవసాయ భూములపై ఇసుక మేట వేసింది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ఆర్థికంగా ఆదుకుని వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా పొలాలను బాగుచేసుకునేందుకు సహకరించండి.

- కళత్తూరు, పాతపాళెం రైతులు, కేవీబీపురం మండలం

మా పొలంలో హెచ్చరిక బోర్డు ఎత్తివేయండి

'మాది కేవీబీపురం మండలం పీవీకండ్రిగ గ్రామం. నా పేరు లోకేష్. మా తాత గురవయ్యకున్న 7.8 ఎకరాల వ్యవసాయ భూమిని మా పెద్దనాన్న, మేము ఉమ్మడిగా సాగు చేసుకునేవాళ్లం. ఐదేళ్ల క్రితం పెద్దమనుషుల సమక్షంలో చెరిసగం పంచుకున్నాం. మాకు వచ్చిన భాగం వ్యవసాయ భూమిలో సాగు చేయనివ్వకుండా మా పెద్దనాన్న వీరాస్వామి, ఆయన కుమారుడు ప్రేమ్‌కుమార్ దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులను తప్పుదారిపట్టించడంతో మాపొలంలో రెవెన్యూ వారు హెచ్చరిక బోర్డు పెట్టారు. క్షేత్రస్థాయిలో విచారించి మా భూమిలో బోర్డు తొలగించండి. తిరిగి మేము పంటలు సాగు చేసుకోవడానికి సహకరించండి' అంటూ కుటుంబంతో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. కలెక్టర్‌కు అర్జీ అందజేయగా పరిశీలిస్తామన్నారు. ఇదే భూవివాదంపై రెండు వారాల క్రితం వీరిపై వీరాస్వామి కుటుంబం వీరిపై ఆరోపణలు చేస్తూ కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ క్యాన్ తీసుకుని తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యకు చేసుకుంటామని బెదిరించిన సంగతి తెలిసిందే.

12గంటల పనివిధానాన్ని రద్దు చేయండి



మన రాష్ట్రంలో పని గంటలను 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నేత విజయకుమార్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు గంగాదేవి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముగ్గురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన పి.మల్లికార్జున అలియాస్ బాలు, ఉల్లి గుణశేఖర్ స్నేహితులు. జులాయిగా తిరిగేవారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన రోహిణి అలియాస్ శ్రీదేవితో వీరికి పరిచయమైంది. ఈమె సహకారంతో ఈనెల 9న తిరుపతికి చెందిన ఓ బాలికను అపహరించి ఆ ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకుని తల్లితండ్రులకు అప్పగించారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

ప్రతి వారం గైర్హాజరు ● పట్టించుకోని ఉన్నతాధికారులు



సోమవారం ఉదయం 11.00 గంటలకు గ్రీవెన్స్‌లో ఉన్న అధికారులు వీరే

తడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై అర్జీలను తీసుకుని, వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో అన్నిశాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే ఈ కార్యక్రమానికి కొన్నిశాఖల అధికారులు గైర్హాజరు కావడం రివాజుగా మారింది. మండలంలో కొన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే ఉంటుందన్న విషయమే మర్చిపోయారు. ముఖ్యంగా ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఉద్యాన, వైద్యశాఖలకు సంబంధించిన అధికారులు గత కొన్ని నెలలుగా గ్రీవెన్స్ డే కార్యక్రమానికి రావడం మానేశారు. ఇక కొందరు అధికారులు చుట్టపుచూపుగా వచ్చామా... సంతకం పెట్టామా... వెళ్లిపోయామా... అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకి వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఉద్యాన, వైద్య శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. విద్యాశాఖ, హౌసింగ్, ఉపాధి హామీ, వెలుగు అధికారులు వచ్చి సంతకం చేసి 11 గంటలకే వెళ్లిపోయారు. మత్స్య శాఖ అధికారి 11.15కు వచ్చారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్ డేలో పాల్గొనేలా చూడాల్సిన అవసరం ఉంది.

పశు వైద్యాధికారిని నియమించండి



బాలాయపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బాలాయపల్లి పశువైద్యశాలలో ఆరు నెలలుగా పశువైద్య అధికారి లేకపోవడంతో పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పశువైద్యాధికారి నెల్లూరు జిల్లా సైదాపురం మండలానికి బదిలీ అయ్యారు. వెంకటగిరి మండలం యాతలూరు పశువైద్యాధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన వారంలో ఒక్క రోజుమాత్రమే బాలాయపల్లి పశువైద్యశాలకు వచ్చి వెళుతుంటారు. ఆయన ఏ రోజు వచ్చి వెళుతున్నారో పాడిరైతులకు తెలియడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పశువైద్యాధికారిని నియమించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



పుష్పాలంకరణలో నాగేశ్వరస్వామి

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో కార్తీక మాస సోమవారం పురస్కరించుకుని ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయం, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడు, మన్నారుపోలూరు సంతానేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళలు విచ్చేసి దీపాలు వెలిగించి పూజలు చేశారు. నాగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అభిషేకానంతరం స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అభయ శంకరుడి ఆలయంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు చేశారు.

విజ్ఞానానికి తొలిమెట్టు గ్రంథాలయాలు



సెమినార్‌లో మాట్లాడుతున్న లైబ్రేరియన్ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానానికి తొలిమెట్టని లైబ్రేరియన్ శ్రీనివాసులు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ జ్ఞానాన్ని, సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నన్నయ్య, తిక్కన, ఎర్రన, శ్రీశ్రీ వంటి ప్రముఖ కవుల గురించి వివరించారు. గ్రంథాలయాకు వెళ్లి పుస్తకాలు చదివితే జ్ఞానంతో పాటు మంచి అలవాట్లు అలవడుతాయన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి విష్ణువర్మ

వెంకటగిరి టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి సివిల్ కోర్టు జడ్జి విష్ణువర్మ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, వృద్ధుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అబాకస్ పోటీలకు ప్రగతి విద్యార్థులు

కోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి విద్యానికేతన్ చిన్నారులు జాతీయస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన ఐడియల్ ప్లే అబాకస్ ఇండియా సంస్థ తమిళనాడు రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ పోటీలను నిర్వహించింది. సోమవారం ఈ పోటీలలో ప్రగతి విద్యానికేతన్‌లో 1వ తరగతి చదువుతున్న హన్నారాజ్ పాల్ మొదటి బహుమతి, 5వ తరగతి విద్యార్థి శామ్యూల్ రాజ్‌పాల్ 5వ బహుమతి గెలుచుకున్నారు. వీరు జనవరి 7న నిర్వహించనున్న జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో పాల్గొంటారని కిషోర్ పేర్కొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కిషోర్

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

అక్రమ మద్యం విక్రేతకు రిమాండ్

నాయుడుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బేరిపేట సెంటర్‌లో కూల్‌డ్రింక్ షాప్ నిర్వహిస్తున్న భాస్కర్ మరో వ్యక్తితో కలిసి తమిళనాడుకు చెందిన 25 క్వార్టర్ల మద్యం బాటిళ్లు, ఏపీకి చెందిన 38 మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వచేసి విక్రస్తుండగా అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని భాస్కర్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా జడ్జి మీనాక్షిసుందరి రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్స్ బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సింహాద్రి తెలిపారు. ఎంఎస్సీ, ఎంసీఏ పూర్తిచేసిన అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.





కుదిరి వద్ద పొలాల్లో నాట్లు వేస్తున్న కూలీలు - ఎన్‌వీకండ్రిగ వద్ద మానుతోలి పొలాన్ని చదును చేస్తున్న రైతు

ముమ్మరంగా రబీ సాగు

జోరుగా సాగుతున్న వరినాట్లు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వరినాట్లు ఊపందుకున్నాయి. సెప్టెంబరులో కురిసిన వర్షాలకు ముందుగా నారు పోసిన రైతులందరూ పొలాలు దున్ని నాట్లు వేస్తున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో నవంబరు ప్రారంభం నుంచే వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 13 వేల హెక్టార్లకు పైగా వరినాట్లు వేయడానికి అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. బావులు, బోర్లలో భూగర్భ జలాలు ఉబికి వచ్చాయి. రైతులంతా పొలాలు దున్ని వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. సూళ్లూరుపేట మండలం కుదిరి, చెరువుకండ్రిగ, మంగళంపాడు, మన్నారుపోలూరు గ్రామాల్లో ఇప్పుడే వరినాట్లు వేస్తున్నారు. కోటపోలూరు, ఎన్‌వీకండ్రిగ, సామంతమల్లాం, మన్నారుపోలూరు, పడమటి కండ్రిగ, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లువేసి ఎరువులు వేస్తున్నారు. అదే విధంగా తడ మండలంలో వేనాడు, ఇరకం, కాదులూరు, మాంబట్టు గ్రామాల్లో ఇప్పటికే వరినాట్లు పూర్తయ్యాయి. పలుచోట్ల వ్యవసాయ పనులు సాగుతున్నాయి. దొరవారిసత్రంలో పలు గ్రామాల్లో ఎల్లిపైర్లు వేయగా కొన్ని గ్రామాల్లో ఇప్పుడే నాట్లు వేస్తున్నారు. మరో వారం రోజుల్లో వరినాట్లు మరింత ఊపందుకుంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పారిశ్రామికాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ అహర్నిషలు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో దేశ, విదేశాలనుంచి అనేక పరిశ్రమలను మన రాష్ట్రానికి సీఎం తీసుకువస్తున్నారన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో అనేక పరిశ్రమలు రాష్ట్రంలో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడం సీఎం చంద్రబాబు సమర్థతపై వారికున్న నమ్మకమే కారణమన్నారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 16 లక్షల మందికి పైగా ఉద్యోవకాశాలు లభిస్తాయన్నారు. గూగుల్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీ విశాఖకు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, ఇశ్రాయేల్‌కుమార్, వేముల సునీల్, జనార్దనరెడ్డి, పిళ్లేల శ్రీనివాసులు, పార్వతయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పాశం



ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ప్రతి నెలా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని దీపక్‌రెడ్డి సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ సూచించినట్లు చెప్పారు.

పోలేరమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో సోమవారం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని హరిజనకాలనీలో పోలేరమ్మ ఆలయం ఏర్పాటు చేసి ఏడాది కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.కార్యక్రమంలో చేవూరు విజయ మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య, కల్లూరు రవి, సుబ్బారావు పాల్గొన్నారు.

కార్తీక సోమవార పూజలు



శివాలయంలో కార్తీకదీపాలను వెలగిస్తున్న భక్తులు

గూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని పలు శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమసుందేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలగించారు.

గూడలిలో...



గూడలిలో ఊరేగుతున్న సంగమేశ్వరుడు, కామాక్షీదేవి

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గూడలిలోని పురాతన సంగమేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక పూజలు జరిగాయి. సంగమేశ్వరుడికి వేదపండితులు అభిషేకాలు చేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఉభయకర్తలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సంగమేశ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

వీవోఏ ఎంపికపై ఫిర్యాదు

ఓజిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ సంఘ బంధం-2లో సభ్యుల తీర్మానం లేకుండా వీవోఏను ఎంపిక చేయడంపై ఆ సంఘ సభ్యులు సోమవారం ఎంపీడీవో నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఏపీఎం పద్మతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎంపీడీవో చెప్పారు.

టైనీటాట్స్ స్కూల్‌కు గ్లోబల్ క్లాస్ అవార్డు

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టైనీటాట్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు గ్లోబల్ క్లాస్ అవార్డు దక్కింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఫ్యూచర్ ఆఫ్ దుబాయ్ సదస్సులో టైనీటాట్స్ కరస్పాండెంట్ ధనుంజయరెడ్డి అవార్డు అందుకున్నారు.

ఆర్థిక సాయం

నాయుడుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం లోతువానిగుంటలో సిలిండర్ పేలి పూరిల్లు కాలిపోయిన విషయం తెలిసిందే. బాధితురాలు సుబ్బమ్మకు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ రఫీ రూ.10వేలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయ, లక్ష్మయ్య, గిరి, నరసమ్మ, కోకిల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

వాకాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం గ్రామానికి చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి తల్లి కృష్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి దుగరాజపట్నం చేరుకొని కృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి



తాళ్వాయిపాడు ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో శంకరయ్య

పెళ్లకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రతి విద్యార్థీ ఉతీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు ఎంఈవో మించల శంకరయ్య అన్నారు. సోమవారం మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను ఎంఈవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అపార్, ఆధార్ అప్డేట్ సకాలంలో పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. 2026 మార్చి 16నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని, ఈ నేపథ్యంలో డిసెంబరు 6వ తేదీ నుంచి వంద రోజుల ప్రత్యేక తరగతులను ప్రారంభించనున్నట్లు ఎంఈవో చెప్పారు.

పాఠశాలలో తనిఖీలు



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తానయ్య

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మస్తానయ్య సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

రంగన్నగుంటలో అంబళం పూజ

కోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ రంగన్నగుంటలో సోమవారం రాత్రి అయ్యప్ప అంబళం పడిపూజ జరిగింది. రంగన్నగుంట, వెంకన్నపాళెం, తిన్నెలపూడి గ్రామాలకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు పూజ నిర్వహించారు. స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు.



అంబళం పూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజకు కొలువుదీర్చిన అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తి విగ్రహం

సూళ్లూరుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. సోమవారం తమిళ కార్తీక మాసం ప్రారంభం కావడంతో పాటు శబరిమలైలో అయ్యప్ప ఆలయాన్ని తెరిచి భక్తుల దర్శనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాపూజీవీధిలో అయ్యప్పస్వామి భక్తులు పడిపూజ, జ్యోతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ చేశారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తి విగ్రహాన్ని పార్కువీధిలోని మద్వేంకటరామ్మూర్తి స్వామి ఆలయం వద్ద నుంచి పడిపూజ నిర్వాహకులు, చిన్ని జువెలరీ అధినేత శ్రీనివాసులు చేతుల మీదుగా ఊరేగింపుగా పడిపూజ ప్రాంగణానికి తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీర్చిన అయ్యప్పస్వామి, సుబ్రమణ్య స్వామి, వినాయకుడి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, జ్యోతి ప్రజ్వళన చేసి పడిపూజ ప్రారంభించారు. మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ దంపతులు, అజంత హోటల్ అధినేత బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో అందిన అర్జీలను పరిశీలించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా వీఆర్వోలు చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నరాణి, వ్యవసాయశాఖ ఏవో శిరీషా తదితరులు పాల్గొన్నారు.

1250 పక్కా గృహాల మంజూరు

డక్కిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలో 1250మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయని ఎంపీడీవో రవీంద్రబాబు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి మొదటి విడతలో 1250 పక్కా గృహాలు మంజూరయ్యాయని, ఈనెల 30వ తేదీలోగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణాలు చేపట్టే స్థలాలను గుర్తించి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా ఇళ్లు కావాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.